# ప్రభాత సమాచారం
https: epaper.
prabhathasamacharam.com
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
■ మంగళవారం | 28 అక్టోబర్ 2025 | ■ 15 పేజీలు




9

## సోయా కొనుగోళ్లపై సోయి లేని ప్రభుత్వాలు

■ బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యే ఇద్దరూ దద్దమ్మలే ■ మాజీ మంత్రి జోగు రామన్న ధ్వజం

### రైతులకు ఇబ్బంది కలగకుండా కొనుగోళ్లు

కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్యే పాయల్ శంకర్



జిల్లాలో వాతావరణంలో ఏర్పడిన మార్పుల వల్లే పత్తిలో తేమ శాతం పెరిగిందని, రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు జరిగేలా చూస్తామని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ములిగే నక్క మీద తాటికాయ పడ్డట్టు అసలే ఇబ్బందుల్లో ఉన్న రైతులకు అధిక వర్షాల వల్ల తేమశాతం పెరుగుతోందని, తేమ శాతం విషయంలో సీసీఐ సిఎండి, చీఫ్ సెక్రటరీ, అధికారులతో మాట్లాడటం జరిగిందన్నారు. రైతులు ఆందోళన చెందవద్దని అన్నారు.



## తొలిరోజే తేమ పేచీ
# ప్రతిష్టంభన
### తేలని తేమ కిరికిరి.. దక్కని మద్దతు ధర.. రోడ్డెక్కిన పత్తి రైతులు



ఆదిలాబాద్ జిల్లాలో పత్తి కొనుగోళ్లలో ప్రతిష్టంభన నెలకొంది. మార్కెట్‌లో కనీసం ప్రభుత్వ మద్దతు ధర దక్కకపోవడంతో అన్నదాతల ఆశలు ఆవిరయ్యాయి. వ్యాపారులు, అధికారుల తీరుతో ఆక్రోశం వ్యక్తం చేస్తూ ఆందోళన చేపట్టారు. పత్తిలో తేమ అధికంగా ఉందని కొనుగోళ్లకు సీసీఐ నిరాకరించడం, వ్యాపారులు ప్రభుత్వ మద్దతు ధర కంటే తక్కువగా నిర్ణయించడంతో.. పత్తితో మార్కెట్‌కు వచ్చిన అన్నదాతలు అగచాట్లు పడాల్సిన పరిస్థితి తలెత్తింది. కొనుగోళ్లు ప్రారంభించిన తొలిరోజే పత్తి విక్రయాలకు అంతరాయం ఏర్పడింది. జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆధ్వర్యంలో సోమవారం సీసీఐ అధికారులు, వ్యాపారులు, రైతుల సమక్షంలో పత్తి కొనుగోళ్లు ప్రారంభించారు. యార్డులో కొనుగోళ్లు ప్రారంభం కాగానే ఒకటి రెండు వాహనాలు మినహా.. మిగతా వాటికి తేమ శాతం అధికంగా చూపించడంతో సీసీఐ అధికారులు కొనుగోళ్లు నిలిపివేశారు. దీంతో రైతుల్లో ఒక్కసారిగా ఆగ్రహం వ్యక్తమైంది. తూకం వేసే కాంటాల వద్దనే ఆందోళన చేపట్టారు. తొలి పత్తి కావడంతో కొంత తేమ చూపిస్తుందని సీసీఐ కొనుగోలు చేయాలని పట్టుబట్టారు. కానీ ఆ సంస్థ అధికారులు ఇందుకు నిరాకరించడంతో రైతులు ఆందోళనకు దిగారు. మరో పక్క సీసీఐ ధర క్వింటాల్ కు రూ. 8110 ఉండగా.. ప్రైవేట్ వ్యాపారులు క్వింటా రూ.6950 ధర నిర్ణయించారు.

- ■ తేమ ఎక్కువగా ఉంది.. పత్తి కొనం
- ■ తొలిరోజే కొనుగోళ్లను నిలిపి వేసిన సీసీఐ
- ■ 12 శాతానికి మించి తేమ ఉందంటూ సాకు
- ■ మార్కెట్‌లో కాంట వద్ద రైతుల ఆందోళన
- ■ వ్యాపారులతో కలెక్టర్, ఎమ్మెల్యే చర్చలు
- ■ గూడుగోన పద్ధతిలో క్వింటాల్‌కు రూ.6,950 చొప్పున కొనేందుకు వ్యాపారుల అంగీకారం
- ■ ఆ తర్వాత ప్రారంభమైన పత్తి కొనుగోళ్లు..




# లక్కు కిక్కెవరికో తేలింది

- ■ ఉమ్మడి జిల్లాలో ముగిసిన లాటరీ ప్రక్రియ
- ■ మద్యం షాపులకు కలెక్టర్ల ఆధ్వర్యంలో లక్కీడ్రా
- ■ రిజర్వేషన్లు, ఓపెన్ టెండర్ల వారీగా నిర్వహణ
- ■ షాపులు దక్కించుకున్న గౌడ, ఎస్టీ, ఎస్సీలు..
- ■ వైన్స్‌లు దక్కడంతో కొందరి సంబురాలు
- ■ నిరాశతో వెనుదిరిగిన మరికొందరు..
- ■ డిసెంబర్ 1 నుంచి కొత్త మద్యం షాపులు

మద్యం షాపుల దక్కించుకున్న అదృష్టవంతులు అదే 'కిక్కు'తో లక్షలు సంపాదించేదెవరో తేలిపోయింది. రూ.3 లక్షల ఫీజు భారీదే అయినా, ముందు వెనుకా ఆలోచించి, పెట్టిన సొమ్ము పోతే పోయిందని, ధైర్యం చేసి ఉమ్మడి జిల్లా నుంచి టెండర్లు వేసిన వారిలో కొంత మందిని లక్కు వరించగా, మిగతావారికి నిరాశే మిగిలింది. లాటరీ దక్కించుకున్న వారికి ఇది పండుగ రోజు.. సోమవారం ఉదయం లాటరీ ప్రక్రియ ప్రారంభం కాగా ఆయా ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, ఎక్సైజ్ అధికారులు, లాటరీ తీసి షాపు యజమానులెవరో తేల్చారు. కొత్తగా వైన్ షాపులు దక్కించుకున్న వారు డిసెంబర్ 1నుంచి వ్యాపారం ప్రారంభించనున్నారు.

## అన్నదాత అగచాట్లు

- ■ మళ్లీ ధాన్యం కోతలు.. వెంటాడుతున్న వర్షాలు
- ■ అకాల వర్షంతో తడిసి ముద్దవుతున్న ధాన్యం
- ■ మరో వైపు కోత దశలో అడవి పందుల బెడద..

13




### మూడు రోజులు వర్షాలు...
## అప్రమత్తంగా ఉండండి

- ■ ధాన్యం తడవకుండా చూడాలి..
- ■ ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం రాకుండా చూడాలి
- ■ తుఫాన్ ప్రభావం తగ్గే వరకు కోతలు కొయొద్దు
- ■ మంత్రులు ఉత్తమ్, తుమ్మల నాగేశ్వర్ రావు..

రానున్న మూడు రోజులు తుఫాన్ ప్రభావం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు సూచించారు. ధాన్యం, పత్తి, మొక్క, సోయా కొనుగోళ్లు, తుఫాను ప్రభావం దృష్ట్యా తీసుకోవాల్సిన చర్యలపై సోమవారం కలెక్టర్లుతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు.

### వలపువల విసిరి
## రూ.8 లక్షలు దోచేసి

- ■ అమ్మాయిల గొంతుతో మాట్లాడి బురిడీ కొట్టించి..
- ■ అమాయకుడిని నమ్మించి మోసం చేసిన సైబర్ ముఠా..
- ■ సూర్యాపేట జిల్లాకు చెందిన ముగ్గురు అరెస్టు
- ■ వివరాలు వెల్లడించిన ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి

అచ్చం అమ్మాయిల గొంతు మార్చి మాట్లాడుతూ... తీయటి ప్రేమ మాటలతో వలపు వలను విసురుతూ అమాయకులను బుట్టలో దించుతున్న ఓ ముఠాను ఆదిలాబాద్ పోలీసులు పెట్టకేలకు పట్టుకున్నారు. అమ్మాయిగా గొంతు మార్చి మాట్లాడుతూ.. ఓ వ్యక్తి నుండి ఒకటి కాదు రెండు కాదు ఏకంగా ఎనిమిది లక్షల రూపాయలను కాజేసిన ముగ్గురు యువకులను పోలీసులు అరె స్టు చేశారు. ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ జీవన్ రెడ్డి వివరాలు వెల్లడించారు.


వివరాలు 6లో





### వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ

# సమర్థవంతంగా నిర్వహించాలి

■ రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి



**మంచిర్యాల, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**

రాష్ట్రంలో వరి ధాన్యం, పత్తి కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ అదనపు కలెక్టర్లు, జిల్లా పౌర సరఫరాలు, వ్యవసాయ, గ్రామీణ అభివృద్ధి, రవాణా శాఖల అధికారులతో వరి ధాన్యం,పత్తి కొనుగోలు, అకాల వర్షాల కారణంగా తీసుకోవలసిన జాగ్రత్తలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి మాట్లాడుతూ తుఫాను వల్ల అకాల వర్షాల నేపథ్యంలో వరి ధాన్యం, పత్తి కొనుగోలు ప్రక్రియకు ఎలాంటి అవాంతరాలు ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో అవసరమైన టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉన్నాయని, ప్యాడి క్లీనర్లు, తేమ యంత్రాలు అవసరం మేరకు సమకూర్చాలని తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి మాట్లాడుతూ తుఫాను తీవ్రత అధికంగా ఉన్నందున అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. తుఫాను తీవ్రత తగ్గేవరకు హార్వెస్టింగ్ ప్రక్రియ నిలిపి వేయాలని, హార్వెస్టింగ్ చేసిన ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. రైతులు నష్టపోకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని, ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పత్తి కొనుగోలు కపాస్ కిసాన్ యాప్ ద్వారా చేయడం జరుగుతుందని, ఈ యాప్ లో కౌలు రైతులు కూడా సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారుల సహాయంతో వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. వరి ధాన్యం, పత్తి రైతులు తేమ శాతం నిబంధనల ప్రకారం ఉండేలా చూసుకోవాలని, తేమ శాతాన్ని పెంచాలని కేంద్రానికి విజ్ఞప్తి చేయడం జరుగుతుందని తెలిపారు. సరిహద్దు జిల్లాల వారు అప్రమత్తంగా ఉండాలని, బయట రాష్ట్రాల నుండి వచ్చే వరి ధాన్యం, సోయాబీన్, కందులు, పెసలు అక్రమ రవాణా జరగకుండా పర్యవేక్షించాలని తెలిపారు. రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ రవీంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని, వర్షాల దృష్ట్యా ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. గ్రేడ్ ఏ రకానికి క్వింటాలుకు 2 వేల 389 రూపాయలు, సాధారణ రకానికి క్వింటాలుకు 2 వేల 369 రూపాయలుగా మద్దతు ధర నిర్ణయించడం జరిగిందని, సన్న రకం వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాలుకు 500 రూపాయలు అదనంగా అందించడం జరుగుతుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో అవసరమైన టార్పాలను కవర్లను అందుబాటులో ఉంచాలని, ధాన్యం తడవకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ మాట్లాడుతూ పత్తి కొనుగోలు ప్రక్రియ కొరకు చర్యలు చేపట్టాలని, కపాస్ కిసాన్ యాప్ లో రైతుల వివరాలు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి అవసరమైన అన్ని జాగ్రత్తలు పాటిస్తూ పత్తి కొనుగోలు చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి వరి ధాన్యం, పత్తి కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కనీస మౌలిక వసతులు కల్పించడంతో పాటు ప్యాడి క్లీనర్లు, టార్పాలిన్లు, ఇతర సదుపాయాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లాలో 301 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, సి సి ఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కొనుగోలు కొరకు పూర్తిస్థాయి ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పోలీసుల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం



**లోకేశ్వరం, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**

పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల పిలుపు మేరకు లోకేశ్వరం ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో రక్త దాతల ప్రయాణ సౌకర్యార్థం స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి బస్సును ఏర్పాటు చేశారు. ఈ బస్సులో మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లోని సుమారు 50 మంది యువకులు బయల్దేరి వెళ్లి మెగా రక్తదాన శిబిరంలో పాల్గొని తమ అమూల్యమైన రక్తాన్ని ఉచితంగా దానం చేసి తమ ఉదారతను చాటుకున్నారు. ఈ రక్తదాన శిబిరంలో జిల్లా కేంద్రంతో పాటు ఆయా మండలాల నుంచి తరలివచ్చిన సుమారు 500 మంది యువకులతో పాటు పోలీసు అధికారులు కూడా రక్తదానం చేసి యువకుల్లో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ.. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి యువకుల నుంచి పెద్ద మొత్తంలో స్పందన రావడం పట్ల ఆమె ఆనందం వ్యక్తం చేశారు. రక్తదానం చేయడం ద్వారా ఆరోగ్యవంతుడైన వ్యక్తి తన ఆరోగ్యాన్ని మరింత మెరుగుపరచుకోవడమే కాకుండా పరోక్షంగా ఇంకొకరి ప్రాణాన్ని నిలబెట్టినవారు అవుతారని పేర్కొన్నారు. రక్తదానం చేయడం వల్ల కలిగే లాభాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సామాజిక కార్యక్రమాల్లో తరచూ పాల్గొంటూ ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేసిన వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు.కార్యక్రమంలో భైంసా అడిషనల్ ఎస్పీ అవినాష్ కుమార్, నిర్మల్ ఎస్పి రాజేష్ మీనా, భైంసా రూరల్ సీఐ గోపీనాథ్, ముధోల్ సిఐ మల్లేష్, ముధోల్, లోకేశ్వరం ఎస్సై లు బిట్ల పెర్సిస్, గుమ్ముల అశోక్ లతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



### తెగిపడిన విద్యుత్ వైరు

# తప్పిన పెను ప్రమాదం

**బోథ్, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్ జిల్లా బజార్హత్నూర్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ సమీపంలో సోమవారం ఉదయం అకస్మాత్తుగా విద్యుత్ వైరు తెగిపడడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. విద్యుత్ వైరు తెగి పడిన ప్రదేశంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు మాట్లాడుతూ.. గతంలో కూడా విద్యుత్ వైర్లు తెగిపడ్డాయని, విద్యుత్ వైర్లు పాతవి కావడంతో ఓవర్ లోడ్‌తో తెగిపోతున్నాయని అన్నారు. అనుకోని ప్రమాదం జరిగి మా ప్రాణాలు పోకముందే పాత విద్యుత్ వైర్ల స్థానంలో నూతన విద్యుత్ వైర్లను ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

### లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు

# నిధుల మంజూరు

**సారంగాపూర్, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**



సారంగాపూర్ మండలం బీరవెల్లి గ్రామంలో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పునరుద్ధరణ పనులు, అప్‌గ్రేడ్ పనులకు గాను రూ.69.10 లక్షల నిధులు మంజూరు అయినట్లు ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ లిఫ్ట్ ఇరిగేషన్ పునరుద్ధరణ పనులు పూర్తయితే దిగువ ఆయకట్టు రైతులకు మేలు జరుగుతుందని అన్నారు. త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

# సింగరేణిలో క్రీడా సంబురం



**కోల్‌బెల్ట్, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**

సింగరేణి సంస్థ రామగుండం రీజియన్-2 ఏరియాలో క్రీడా సంబురం మొదలైంది. వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించు కంపెనీ లెవల్ కబడ్డీ అండ్ బాడ్మింటన్ పోటీలకు రెడీ క్రీడాకారులు రెడీ అయ్యారు. డివిజన్ పరిధిలోని అబ్దుల్ కలాం స్టేడియంలో కంపెనీ స్థాయి పోటీల నిర్వహణకు యాజమాన్యం సకల ఏర్పాట్లు, వసతులు కల్పనలో నిమగ్నమైంది. నిత్యం బొగ్గ ఉత్పత్తి సాధనతో బిజీబిజీగా ఉండే ఉద్యోగుల్లో ఉపశమనం కోసం సంస్థ ఏటా క్రీడా పోటీలు నిర్వహించి ఎంకరేజ్ చేస్తోంది. ఈ ఇయర్ సైతం పోటీలను గ్రాండ్ గా నిర్వహించేందుకు ఏరియా జనరల్ మేనేజర్ బండి వెంకటయ్య నేతృత్వంలో వివిధ విభాగాల అధికారులు, స్పోర్ట్స్ సూపర్వైజర్స్, కోఆర్డినేటర్స్ ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. క్రీడా జోష్ ఉట్టిపడేలా స్టేడియంను రంగు రంగుల జెండాలు, లైటింగ్స్ తో ముస్తాబు చేశారు. ఈ పోటీల్లో టోటల్ ఆరు టీమ్స్ పార్టిసిపేట్ చేయనున్నాయి. బెల్లంపల్లి-మందమర్రి, శ్రీరాంపూర్, అర్జీ-1 అండ్ అర్జీ-2, అర్జీ-3 అండ్ భూపాలపల్లి, మణుగూరు అండ్ ఇల్లందు, కొత్తగూడెం అండ్ కార్పొరేట్ ఆఫీస్ టీమ్స్ పోటీల్లో తలపడనున్నట్లు కంపిటిషన్స్ నిర్వాహకులు తెలిపారు.ఈ వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ పోటీలకు ఏరియా అధికార ప్రతినిధి, డీజీఎం(పర్సనల్) పి. అరవింద్ రావు చీఫ్ కోఆర్డినేటర్‌గా వ్యవహరించనున్నారు.

# గంజాయి పట్టివేత

**ఆసిఫాబాద్, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**

15 గ్రాముల గంజాయిని టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. టాస్క్ ఫోర్స్ సీఐ రాణా ప్రతాప్ తెలిపిన వివరాల ప్రకారం.. కాగజ్ నగర్ మండలంలోని ఈస్గాం ఏరియాలో గంజాయి విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు వాహనాలు ఆపి తనిఖీ చేయగా మిథున్ మండల్ వద్ద నుంచి 8 గ్రాములు, రాహుల్ మండల్ వద్ద 7 గ్రాములు లభ్యమైంది. ఇద్దరి నుంచి 15 గ్రాముల గంజాయి పట్టుబడింది. ప్రశాంత్ అదుపులో తీసుకోగా మిథున్, రాహుల్ పరారైనట్లు పేర్కొన్నారు.



# ఇద్దరు సైబర్ నేరగాళ్ల అరెస్ట్

**ఆసిఫాబాద్, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**

సైబర్ నేరాలకు పాల్పడిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత మే 21న వా ట్సాప్ లింక్ పంపించి ఆసిఫాబాద్ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి నుంచి సైబర్ మోసగాళ్లు 1లక్ష 66 వేలు కాజేశారు. అదే నెల 27న బాధితులు ఆసిఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి.. అందులోని 60 వేల రూపాయలను పోలీసులు ఫ్రీజ్ చేశారు. సదరు వ్యక్తి బ్యాంక్ అకౌంట్ లావాదేవీ ద్వారా గుజరాత్ రాష్ట్రానికి చెందిన పంకజ్ భాయ్, శైలేష్ మకావన అనే ఇద్దరు సైబర్ నేరాలను పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మే 21 నుంచి మే 28 తేదీ వరకు పలువురి వద్ద నుంచి 3 లక్షల 47 రూపాయలు మోసం చేసినట్లు ఫోన్ యూపీఐ ఐడీ లావాదేవీల ద్వారా గుర్తించినట్లు ఎస్పీ పేర్కొన్నారు. సోషల్ మీడియాలో వచ్చే అనవసరమైన లింక్ లను క్లిక్ చేసి ప్రజలు మోసపోవద్దని. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ కోరారు.





## గుంతలు పూడ్చిన యువకులు

**బోథ్, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**

మండలంలోని కౌట-సాకేర గ్రామాల మధ్య రాంనగర్ మూలమలుపు వద్ద ప్రమాదకరంగా గుంతలు ఏర్పడడంతో సోమవారం సోనాల యువకులు ముందుకు వచ్చి గుంతలను పూడ్చి వేశారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ.. రాంనగర్ మూలమలుపు వద్ద ద్విచక్ర వాహనదారులు పడి గాయాల పాలయ్యారని, ఈ గుంతల వల్ల ప్రాణ నష్టం కూడా జరిగిందన్నారు. ఇక ముందు ప్రమాదాలు జరగకూడదనే ఉద్దేశ్యం తోనే గుంతలను పూడ్చివేశామని తెలిపారు. ఇకనైనా సంబంధిత అధికారులు పట్టించుకుని రోడ్లపై గుంతలు లేకుండా చూడాలని గ్రామస్తులు, యువకులు కోరారు.

## 30న విద్యాసంస్థల బంద్‌కు టీఏవిఎస్ మద్దతు



**ఆదిలాబాద్, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**

తెలంగాణ రాష్ట్రంలో గత 6 సంవత్సరాలుగా రూ. 8500 కోట్ల స్కాలర్షిప్‌లు పెండింగ్‌లో ఉన్నాయని టీఏవీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్రం తనుష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాటిని చెల్లించాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 30న ఎస్ఎఫ్ఐ తలపెట్టిన రాష్ట్ర వ్యాప్త విద్యాసంస్థల బందుకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు. స్కాలర్ షిప్‌లు పెండింగ్ ఉండడంతో ఉన్నత చదువులు పూర్తి చేసుకున్న పేద మధ్యతరగతి విద్యార్థులు తమ ధృవపత్రల కోసం కాలేజి యాజమాన్యలకు వేల ఫీజులను కట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కొందరు మధ్యలోనే చదువులు ఆపేస్తున్నారన్నారు. రెండు నెలల క్రితం విద్యార్థి సంఘాలు, కాలేజీ యాజమాన్య సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసన చేపట్టారన్నారు. ఈ నిరసనలతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.1200 కోట్లను త్వరలో విడుదల చేస్తామని విడుదల చేయలేదన్నారు.

## వరించిన 'లక్కీ' అదృష్టం

### ఒక్క మహిళ.. రెండు మద్యం దుకాణాలు

**నిర్మల్, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**

ఆమె నిన్నటి దాకా మద్యం వ్యాపారి కాదు. ఈ ఏడాది ప్రభుత్వం పిలిచిన మద్యం దుకాణాల టెండర్లలో పాల్గొన్న ఆమెకు రెండు దుకాణాలు దక్కాయి. రెండు దుకాణాలకు దరఖాస్తు చేసుకున్న ఆమెకు అదృష్టం తలుపు తట్టింది. రెండింటా లక్కీ డ్రా లో విజేతగా నిలిచింది. నిర్మల్ జిల్లా కేంద్రంలో నివాసం ఉంటున్న గుర్రాల హారిక లక్ష్మణ చందా, పొనకల్ గ్రామాల్లో రెండు మద్యం దుకాణాలకు టెండర్లు వేసింది. సోమవారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆధ్వర్యంలో లక్కీ డ్రా పద్ధతిలో దుకాణాలు ఖరారు చేయగా ఆమెకు రెండు షాపులు దక్కించుకున్నది. ఆమెను ఈ సందర్భంగా లక్కీ లేడీ అంటూ అభినందించారు.



# లక్కీ డ్రా ద్వారా మద్యం దుకాణాల కేటాయింపు





**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**

నూతన మద్యం పాలసీ విధానం ప్రకారం లక్కీ డ్రా పద్ధతిన మద్యం దుకాణాలు కేటాయించడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ మండలం శ్రీరాంపూర్‌లో గల పి.వి.ఆర్. గార్డెన్స్‌లో నిర్వహించిన లక్కి డ్రా కార్యక్రమానికి ఆబ్కారీ, మద్య నిషేధ శాఖ అధికారి నంద గోపాల్, మంచిర్యాల ఎ.సి.పి. ప్రకాష్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నూతన మద్యం పాలసీ విధానం ద్వారా దుకాణాలు కేటాయించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో మద్యం దుకాణాల కొరకు 1 వేయి 712 దరఖాస్తులు వచ్చాయని, 73 దుకాణాలకు లక్కీ డ్రా తీయడం జరిగిందని తెలిపారు. నూతన మద్యం పాలసీ నియమ, నిబంధనలను అనుసరిస్తూ ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా ఏర్పాట్లు చేయడం జరిగిందని, దుకాణాల వారీగా దాఖలైన దరఖాస్తులకు సంబంధించిన దరఖాస్తుదారుల సమక్షంలో లక్కీ డ్రా తీస్తూ మద్యం దుకాణాల కేటాయింపును ఖరారు చేయడం జరిగిందని, లక్కీ డ్రా కోసం వినియోగించిన టోకెన్ లను అందరికీ చూపిస్తూ, పారదర్శకంగా ప్రక్రియ ప్రారంభం నుండి చివరి వరకు ఫొటో, వీడియో చిత్రీకరణ చేయడం జరిగిందని, టోకెన్ కలిగి ఉన్న వారిని మాత్రమే లోపలికి అనుమతించడం జరిగిందని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పరిసర ప్రాంతాల్లో కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. దుకాణం పొందిన వారు నిబంధనలను అనుసరిస్తూ, లైసెన్స్ ఫీజు రూపేణా నిర్ణీత రుసుము చెల్లించేందుకు వీలుగా వేదిక వద్దనే అవసరమైన కౌంటర్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

## పెండింగ్ పీఎఫ్, ఈఎస్ఐ కార్మికుల ఖాతాల్లో జమచేయాలి



**సిఐటియు జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్**

**ఆదిలాబాద్, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**

రిమ్స్, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికులకు 3 నెలలుగా పెండింగ్‌లో ఉన్న పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. 15 మంది కార్మికులకు వేతనాలు ఖాతాల్లో జమకాలేదని వెంటనే జమచేయాలని సోమవారం రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ.. ఆసుపత్రుల్లో ఐ హెచ్ ఎఫ్ ఎం ఎస్. టెండర్ల కాల పరిమితి ముగిసింది. వెంటనే నూతన టెండర్లను పిలవాలని ఈ టెండర్లలో కార్మికులందరికీ కనీస వేతనం రూ. 26 000 చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ ఉద్యోగ భద్రత పెన్షన్ సౌకర్యాలను ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్ లో ఉన్న 15 మంది కార్మికుల వేతనాన్ని కార్మికుల పీఎఫ్, ఈఎస్ఐ ని ఖాతాల్లో వెంటనే జమచేయాలని డిమాండ్ చేశారు.. హక్కుల సాధన కోసం రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలను నిర్వహిస్తామని కార్మిక లోకం పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. నూతన టెండర్లు పిలవాలని కనీస వేతనం టూరూ. 26 వేల డిమాండ్ల సాధనకోసం రానున్న రోజుల్లో జరిగే పోరాటాలకు కార్మికులు అధిక సంఖ్యలో హాజరవ్వాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు పొచ్చన్న, రిమ్స్ సహాయ కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.




## గాయత్రి మైన్స్ తనిఖీ

**ముథోల్, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**

నియోజక వర్గ కేంద్రమైన ముథోల్ లోని ప్రభుత్వ స్థలం అయిన గుట్టపై గాయత్రి కంపెనీ నిర్వహింస్తున్న మైన్స్ (తెల్లరాళ్లు) తీస్తున్న ప్రదేశంను సోమవారం ఆర్ఐ నారాయణరావు పటేల్ పరిశీలించారు. గుట్టపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడుతున్నా చోట సంబదిత కంపెనీ వారు ప్రమాదసూచిక బోర్డులు ఏర్పాటు చేయటం లేదని ఆర్ఐ తెలిపారు. సంబంధిత కంపెనీకి ప్రభుత్వం గతంలో గుట్టను లీజుకు ఇచ్చింది. దీంతో ఈ మైనింగ్ తరలిస్తుంది. అయితే గత కొన్ని ఏళ్ల నుండి మైన్స్ తరలించి నప్పటికీ పెద్దపెద్ద గుంతలు ఏర్పడి వర్షం నీరు నీల్వ ఉన్నప్పటికి వాటి వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో, ప్రమాద సంభవించే అవకాశం ఉందని పలువురు రైతులు పలుమార్లు రెవెన్యూ అధికారులకు విన్న వించారు. ఈ విషయాన్ని సంబందిత కంపెనీప్రతినిధులకు తెలియజేసిన పట్టించు కోకపోవటంతో ఈ విషయాన్ని ఉన్నతాధికా రులకు తాజాగా నివేదించినట్లు ఆర్ఐ పేర్కొన్నారు.

**అక్రమ మొర్రం తవ్వకాలు..**

ముథోల్ శివారులో అక్రమంగా మొరం తవ్వుతున్న ప్రొక్లయినర్ సోమవారం సీజ్ చేసినట్లు ఆర్ఐ నారాయణ పటేల్ తెలిపారు. అక్రమంగా మొరం తరలిస్తున్నారన్న సమాచారం మేరకు అక్కడికి వెళ్లి సంబంధిత వాహనాన్ని సీజ్ చేసి, ఉన్నతధికారులకు నివేదించినట్లు ఆయన పేర్కొన్నారు. జిపిఓ కౌసర్ ఖాన్, నరసయ్యలు ఉన్నారు.



## యువతకు ఉపాధి అవకాశాలు



**ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజార్షి షా**

**ఆదిలాబాద్, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**

జిల్లా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా కలెక్టర్ రాజార్షి షా తెలిపారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎంఎస్ఎన్ లాబొరేటరీస్‌లో ఉద్యోగాలకు ఎంపికైన 17 మంది అభ్యర్థులకు నియామక పత్రాలను కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జాబ్ మేళాలో దాదాపు 50 మంది యువకులు దరఖాస్తు చేసుకున్నారని, వారిలో 17 మంది అభ్యర్థులు పరీక్షలో ఉత్తీర్ణులై లాబొరేటరీస్‌లో నియామకం పొందినట్లు తెలిపారు. పటాన్‌చేరు (సంగారెడ్డి)లో ఉన్న ఈ ప్రముఖ ఔషధ తయారీ సంస్థలో నియామకం పొందిన వారికి ఉచిత వసతి, భోజనం, రవాణా సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇది జిల్లా యువతకు ఒక మంచి అవకాశం అన్నారు. జిల్లాలో మరిన్ని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా జిల్లా ఉపాధి కార్యాలయం ద్వారా ఇలాంటి కార్యక్రమాలు కొనసాగుతాయని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పన అధికారి మిల్కా, లాబొరేటరీస్ హెచ్.ఆర్. సుబ్బారావు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పీజీ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి

**నిర్మల్, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**
పీజీ కాలేజ్‌ని బేస్ చేసుకుని యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం భగత్ సింగ్ భవనంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘ నాయకులు మాట్లాడుతూ... జిల్లా కేంద్రంలో ఉన్న పీజీ కాలేజ్ ని బేస్ చేసుకుని నూతన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ఏర్పాటు చేస్తానన్న యూనివర్సిటీని ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మల్ జిల్లా కేంద్రంలో యూనివర్సిటీ ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ



నిర్మల్ జిల్లాలో ఉన్నంత విద్య లేక దూర ప్రాంతాలకు వెళ్లలేక మధ్యలోనే విద్యను ఆపేసే పరిస్థితి ఏర్పడుతుంది కావున జ్ఞాన సరస్వతి పేరిట నిర్మల్ జిల్లా కేంద్రంగా విశ్వవిద్యాలయాలు ఏర్పాటు చేయాలని యూనివర్సిటీ ఏర్పాటయితే యువతకు ఉన్నంత విద్య అందుబాటులో ఉంటుందని స్థానికంగానే ఉన్నంత విద్యను అభ్యసించే అవకాశం ఉంటుంది. కావున యూనివర్సిటీ ఏర్పాటు చేయవలసిందిగా ప్రభుత్వాన్ని డిమాండ్ డిమాండ్ చేస్తున్నాం లేనియెడల దశలవారీగా కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాం. కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ దిగాంబర్ సింగారి వెంకటేష్, జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి కైలాస్, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు పొన్నం శివాజీ గౌడ్ జస్వంత్, రాకేష్, కార్తీక్, రాజు, రంజిత్ కుమార్, రవి, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



## డిగ్రీ ఫీజు గడువును పెంచాలి

**లక్షెట్టిపేట, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**
కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో విద్యార్థుల ఫీజుల చెల్లింపు గడువును పెంచాలని పీ డీ ఎస్ యూ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ అన్నారు. కాకతీయ యూనివర్సిటీ అనుబంధ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల ఫీజుల చెల్లింపు గడువు నేటితో ముగించడంతో మిగతా విద్యార్థులు ఫీజులు కట్టలేని పరిస్థితుల్లో ఇబ్బందులు పడే పరిస్థితి ఉందన్నారు. బడుగు, బలహీన, వర్గాల విద్యార్థులు చదువుకు దూరం అయ్యే పరిస్థితి ఉందని, కాబట్టి తక్షణమే డిగ్రీ విద్యార్థుల ఫీజుల తేదీల గడువును పొడిగించి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నాము. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కార్తీక్,అజయ్, ఆంజనేయులు, విజయ్, జస్వంత్ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని వినతి



**నిర్మల్, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లాలోని దివ్యనగర్ లో గల 534 సర్వేనెంబర్ లోనీ ప్రభుత్వ భూమిలో అంబేద్కర్ స్టడీ సర్కిల్‌ను ఏర్పాటు చేయాలని జిల్లా అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు బత్తుల రంజిత్ ఆధ్వర్యంలో సోమవారం అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటస్వామి స్వామి మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగ యువతి యువకులకు ఉపయోగపడే విధంగా జిల్లాకి స్టడీ సర్కిల్‌ను కేటాయించాలని వారు కోరారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు ఈ పురుషోత్తం, ఆకుల రమేష్, మదస్తు భూమేష్, శ్రీనివాస్ తదితర నాయకులు పాల్గొన్నారు.

### పదవ తరగతిలో వంద శాతం

## ఫలితాలు సాధించాలి

**నిర్మల్, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**
ఈ విద్యా సంవత్సరం పదో తరగతిలో ప్రతి పాఠశాల 100 శాతం ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి దర్శనం భోజన్న అన్నారు. సోమవారం సెండ్ థామస్ హైస్కూల్లో స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పదవ తరగతి పరీక్షల నిర్వహణపై ప్రత్యేక కార్యచరణ రూపొందించుకొని అమలు చేయాలని సూచించారు. సిలబస్ను త్వరగా పూర్తిచేసి ఉదయం సాయంత్రం వేళలో స్టడీ అవర్స్ నిర్వహించాలని ప్రతి విద్యార్థి పేరును యుడైస్ లో నమోదు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.



## తాండూర్‌లో తెల్లకాకి దర్శనం



**తాండూర్, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా తాండూర్ లోని ఓ ఇంటి వద్ద ఇటీవల తెల్లరంగు హౌస్(దేశీయ కాకి) కనిపించింది. ఈ విషయమై హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ సభ్యుడు, వన్యప్రాణి పరిరక్షకుడు శ్రీపతి వైష్ణవ్ తెలిపారు. రాష్ట్రంలో కొన్ని భాగాలు తెల్లగా ఉన్న కాకులు మాత్రమే కనిపించగా.. పూర్తి తెల్లకాకి కనిపించడం ఇదే తొలిసారి కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. వైష్ణవ్ తెలిపిన వివరాల ప్రకారం.. కాకి ల్యూసిజం అనే అరుదైన జన్యు పరిస్థితిని కలిగి ఉంది. దీని వల్ల పక్షి రెక్కలు పూర్తిగా తెల్లగా మారినప్పటికీ కళ్ల రంగు సహజంగా ఉంది. అల్బినిజంలో కళ్లతో సహా శరీర మంతా తెల్లబడుతుంది. కానీ ల్యూసిజంలో కళ్లు సాధారణంగా ఉంటాయి. ఇదే రెండింటి మధ్య ఉన్న ముఖ్యమైన తేడా. చాలా తెలివైన కాకులు వాటి సామాజిక బంధాలు, సమస్యలను పరిష్కరించుకునే సామర్థ్యం వల్ల ఇబ్బందులను అధిగమిస్తాయి. తెల్లరంగు కాకి పెద్ద వయస్సు వరకు జీవిస్తుందని వైష్ణవ్ తెలిపారు.

## విద్యార్థులకు సదుపాయాల కల్పన



**మంచిర్యాల, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**
ప్రభుత్వం విద్యార్థుల సౌకర్యార్థం అన్ని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తూ పూర్తి స్థాయిలో సదుపాయాలు కల్పిస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్ నగర్ ప్రాంతంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి తరగతి గదులు, వంటశాల, రిజిస్టర్లు, మధ్యాహ్న భోజనం నాణ్యత, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పూర్తిస్థాయిలో సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ మధ్యాహ్నం భోజనంలో పౌష్టిక ఆహారాన్ని అందిస్తుందని, ఈ క్రమంలో విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం నిష్ణాతులైన ఉపాధ్యాయులను నియమించిందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత చదువులను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టులలో పాఠ్యాంశాలు బోధించి వారి అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు



**ఆసిఫాబాద్, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**
బాధితులకు సత్వరమే న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా అర్జీలు స్వీకరించారు. ఫిర్యాదుదారుల సమస్యలను విని, వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత డిఎస్పీ /ఎఎస్పీ, సర్కిల్ ఇన్స్పెక్టర్ లతో ఫోన్ లో ద్వారా మాట్లాడి సమస్య స్థితిని, పరిష్కారానికి సూచనలు చేశారు. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకోవాలన్నారు. పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని పేర్కొన్నారు.



### పోలీసుల ఆధ్వర్యంలో

## నిత్యావసర సరుకులు పంపిణీ

**ఆసిఫాబాద్, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**
పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా వాంకిడి పోలీస్ స్టేషన్ పరిధిలోని సరికేపల్లి గ్రామంలో సోమవారం 30 కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మహేందర్ మాట్లాడుతూ పోలీస్ అమరవీరులు ప్రజల భద్రత కోసం ప్రాణాలను అర్పించారని వారి త్యాగాన్ని స్మరించుకుంటూ, సమాజంలోని బలహీన వర్గాలకు సహాయం చేయడం ద్వారా వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు.పోలీసు శాఖ కేవలం చట్టం అమలు చేయడమే కాకుండా, ప్రజల మధ్య సానుభూతిని పెంచే కార్యక్రమాలను కూడా నిర్వహిస్తోందని పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

### వర్క్ షాప్‌లోపార్కింగ్ షెడ్

## నిర్మాణానికి భూమి పూజ

**మందమర్రి, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**
ఏరియాలోని వర్క్ షాప్ కార్మికుల సౌకర్యార్థం నూతన మోటార్ సైకిల్ స్టాండ్ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. వర్క్ షాప్ ఆవరణలో సోమవారం ఎఐటియుసి నాయకులు మోటర్ సైకిల్ స్టాండ్ నిర్మాణానికి పూజలు నిర్వహించి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎఐటీయుసీ బ్రాంచ్ ఉపాధ్యక్షులు భీమనాధుని సుదర్శన్ మాట్లాడుతూ వర్క్ షాప్ ఆవరణలో ఇదివరకు ఉన్న మోటార్ సైకిల్ స్టాండ్ కార్మికులకు సరిపోవడం లేదని నూతనంగా మరో స్టాండ్ నిర్మాణం చేపట్టాలని గుర్తింపు సంఘం ప్రతిపాదన మేరకు ఏరియా అధికారులు నూతన మోటార్ సైకిల్ స్టాండ్ నిర్మాణానికి అంగీకరించడంతో నిర్మాణ పనులు చేపట్టడం జరిగిందన్నారు. గుర్తింపు సంఘం ఏఐటియుసి కార్మికుల హక్కుల సాధనతో పాటు వారి సంక్షేమానికి నిర్విరామంగా కృషి చేస్తుందని స్పష్టం చేశారు.



# ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి



**మంచిర్యాల, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావుతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. మంచిర్యాల పట్టణంలోని హమాలివాడ, సూర్యనగర్ కాలనీ వాసులు గత కొద్ది రోజులుగా తమ కాలనీకి నల్లా నీరు రావడం లేదని, నీటిని అందించాలని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణానికి చెందిన భూపతి జగన్ మోహన్ తన తండ్రి పేరిట గల భూమిని ఆయన మరణించినందున తన పేరిట పట్టా మార్పు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల మండలం వేంపల్లి గ్రామానికి చెందిన రాయిలి సత్యం తాను తన భూమి హద్దుగా కొలత కొరకు దరఖాస్తు చేసుకున్నానని, సర్వే చేయించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కాసిపేట మండలం ధర్మారావుపేట గ్రామానికి చెందిన నేతుల సత్తయ్య తనకు వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి మండల కేంద్రానికి చెందిన జె.బాలక్క, ఎస్.సి. కాలానికి చెందిన ఎన్.లక్ష్మి, భూపెల్లి లావణ్య లు తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ వేరువేరుగా అర్జీలు సమర్పించారు. బెల్లంపల్లి రైతు ఉత్పత్తిదారుల కంపెనీ ప్రతినిధులు తమ దరఖాస్తులో సేంద్రీయ ఉత్పత్తుల అవుట్ లెట్ కొరకు స్థలం కేటాయించాలని కోరారు. నెన్నెల మండలం నందులపల్లి గ్రామానికి చెందిన ఇందూరి కిష్టయ్య తన కుమారుడు తన భూములు లాక్కొని ఇంటి నుంచి బయటకు వెళ్లగొట్టాడని, తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

**నిర్మల్, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**

ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ తో కలిసి ఆయన ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి దరఖాస్తును పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను అదనపు కలెక్టర్‌కు సమర్పించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో ఆర్డీవో రత్నకల్యాణి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని రాస్తారోకో




**నిర్మల్, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నిర్మల్ జిల్లా మహిషా శాఖ ఆధ్వర్యంలో ఈరోజు అంబేద్కర్ స్టాచు వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఏబీవీపీ నిర్మల్ జిల్లా కన్వీనర్ మూడపెల్లి దినేష్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో 8900 కోట్ల స్కాలర్‌షిప్ పెండింగ్‌లో ఉంది.. గత తొమ్మిది సంవత్సరాలైనా కూడా ఈ యొక్క స్కాలర్‌షిప్‌లను విడుదల చేయడం లేదు.. ఈ యొక్క కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి దాదాపు 3 సంవత్సరాలు అయినప్పటికీ ఇప్పటికీ ఒక్క రూపాయి కూడా విడుదల చేయాలేని పరిస్థితి ఈ యొక్క తెలంగాణ రాష్ట్రంలో కనబడుతుంది. ఇప్పటికైనా మీ యొక్క కాంగ్రెస్ ప్రభుత్వం స్కాలర్షిప్లను విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం లేని ఎడల ఎంత పెద్ద ఉద్యమానికైనా వెనకాడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇందూరు విభాగ్ కన్వీనర్ గంగా ప్రసాద్, నగర హాస్టల్స్ కన్వీనర్ సంతోష్, గంగారెడ్డి, ఓంకార్, ప్రకాష్, యోగేష్, శ్రీధర్, ముత్యం పాల్గొన్నారు.

## యువతలో సేవాస్ఫూర్తిని పెంపొందించడమే ర్యాలీ లక్ష్యం

**మంచిర్యాల, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**

పోలీస్ సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని మేడిపల్లి పోలీస్ ఆధ్వర్యంలో బోడుప్పల్ ఎన్టీఆర్ విగ్రహం నుంచి కమాన్ వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఏసీపీ చక్రపాణి మాట్లాడుతూ.. ప్రజల రక్షణ కోసం ప్రాణాలు పణంగా పెట్టే పోలీసు అమరవీరుల త్యాగాన్ని గుర్తు చేసుకుంటూ, యువతలో సేవాస్ఫూర్తిని పెంపొందించడమే ఈర్యాలీ లక్ష్యమన్నారు.



# మొక్కజొన్న కొనుగోళ్లు ప్రారంభం



**ఆదిలాబాద్, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**

రైతులు పండించిన ప్రతి పంటలను ప్రభుత్వాలు కొనుగోళు చేస్తాయని రైతులు అధైర్యపడొద్దని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. సోమవారం మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోళు కేంద్రాన్ని డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డితో కలిసి ప్రారంభించారు. కంటాకు పూజ చేసి తొలిరైతును సత్కరించి మొక్కజొన్నను తూకం వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ రైతుల పంటలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొనుగోళు చేస్తున్నాయన్నారు. రైతులు కూడా నియమనిబంధనలు పాటిస్తు మద్దతు ధరను పొందాలన్నారు. మొక్కను తేమ శాతం నిబంధనతో రూ.2400తో కొనుగోళు చేయడం జరుగుతుందన్నారు. మధ్య దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వ కొనుగోళు కేంద్రంలోనే విక్రయించాలని సూచించారు. త్వరలోనే సోయ కొనుగోళు కేంద్రాన్ని ఏర్పాటు చేసేల చూస్తామన్నారు. వాతావరణ మార్పుల కారణంగా పత్తిలో తేమ శాతం పెరిగిందని, అయితే రైతులు ఎకరానికి 40 నుంచి 50 క్వింటాళ్ల దిగుబడి వచ్చే మొక్క జొన్నల సాగు వైపు దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వం రైతులకు 2400 రూపాయలు మద్దతు ధర అందించి మొక్కజొన్నలను కొనుగోళు చేస్తుందని డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. మధ్య దళారులు లేని కారణంగా రైతులు నేరుగా ప్రభుత్వానికి అమ్ముకోవాలన్నారు. అదే విధంగా సోయా కొనుగోళ్లపై ఇటీవల వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వర రావ్ ను కలిసి విన్నవించడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ద వహించి సోయా కొనుగోళ్లకు కేంద్రం నుంచి అనుమతులు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామల దేవి, తెలంగాణ విత్తన ధృవీకరణ డైరెక్టర్ కేశవులు, వరంగల్ మార్కెటింగ్ జేడీ శ్రీనివాస్, ఆర్డీఓ స్రవంతి, డీఏఓ శ్రీధర్ స్వామి, మార్కెటింగ్ ఏడీ గజానంద్, కొనుగోలు కేంద్రం ఇన్చార్జి పండరీ పాల్గొన్నారు.



## ముథోల్ ఎంపీడీవోగా లవకుమార్ బాధ్యతల స్వీకరణ

**ముథోల్, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**

మండల కేంద్రమైన ముథోల్ లోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోగా లవ కుమార్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గ్రూప్-1 ఫలితాల్లో ఎంపీడీవోగా ఎంపికయ్యారు. ఇంచార్జ్ ఎంపీడీవోగా శివకుమార్ విధులు నిర్వర్తించారు. ఈ తరుణంలో ఆయన స్థానంలో ఎంపీడీవోగా లవ కుమార్ పదవీ బాధ్యతలు చేపట్టారు. ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించడంతో కాంగ్రెస్ నాయకులు శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ప్రాధాన్యత ఇస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రావుల గంగారెడ్డి, సీనియర్ నాయకులు ప్రేమ నాథ్ రెడ్డి, కిషన్ పటేల్, రావుల శ్రీనివాస్, ఎం.ఎ అజీజ్, దిగంబర్, ఎస్.కె నజీమ్, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు

**నిర్మల్, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ పట్టణంతో పాటు నియోజకవర్గంలోని వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరైనట్టు ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి తెలిపారు. నిర్మల్ మున్సిపాలిటీలో 3.70 కోట్లతో వివిధ అభివృద్ధి పనులను మంజూరు చేయడం జరిగిందని మరో 18.70 కోట్లతో సిసి రోడ్లు మురికి కాలువలు నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. బీరవెల్లి ఎత్తిపోతల పథకానికి 6.91 కోట్లు ఆర్ అండ్ బి రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయని పనులన్నీ త్వరలో పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

## ప్రజావాణికి గైర్హాజరైతే చర్యలు : తహశీల్దార్ రామచందర్ రావు



**కన్నెపల్లి, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**

మండల కేంద్రంలో పనిచేస్తున్న అన్ని శాఖల ప్రభుత్వ ఉద్యోగులు ప్రజావాణికి సకాలంలో హాజరవ్వాలని లేకుంటే గైర్హాజరు అయిన అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తహశీల్దార్ రామచందర్ రావు తెలిపారు. ప్రతి సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణికి వివిధ శాఖలలో పనిచేస్తున్న అధికారులంతా తప్పనిసరిగా సకాలంలో హాజరు కావాలని లేకుంటే వారిపై చర్యల కొరకు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపారు. గతంలో లాగా అధికారులు ప్రవర్తిస్తే ఇకపై చర్యలు తప్పవని అన్నారు. ప్రజావాణికి వచ్చే ఫిర్యాదుల పట్ల అధికారులు అంకిత భావంతో పనిచేసి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అన్నారు. ప్రజావాణిలో ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఐ భాస్కర్ రావు, ఐసిడిఎస్ సూపర్వైజర్ ఇందిర, హెల్త్ సూపర్వైజర్ ఇందిర, ఏఓ సాయి ప్రశాంత్, ఏపిఓ శ్రీనివాస్ హాజరయ్యారు.

## యాత్ర ఆనందం సర్వీసులను సద్వినియోగం చేసుకోండి




**నిర్మల్, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**

టీజీ ఆర్టీసీ ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యార్థం యాత్ర ఆనందం సర్వీసులను నడుపుతున్నట్టు నిర్మల్ డిఎం పండరీ తెలిపారు. సోమవారం నిర్మల్ డిపోకు చెందిన లగ్జరీ సర్వీసును యాత్ర ఆనందంలో భాగంగా అయోధ్య వెళ్లే భక్తులకు ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఐదు రోజుల పాటు ఈ సర్వీస్ సేవలు ఉంటాయని వచ్చేనెల 6, 7 తేదీల్లో అయోధ్య అరుణాచలం రామేశ్వరం తిరుపతికి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయడం జరిగిందని ఈ అవకాశాన్ని భక్తులు సద్వినించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ప్రచార అధికారి రమణ అధికారులు పాల్గొన్నారు.



### 7న శ్రీఅడెల్లి మహా పోచమ్మ
## దేవాలయం మహోత్సవం
### అక్టోబర్ 28న మాలధారణ

**సారంగాపూర్, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**
మండలంలోని ప్రసిద్ది చెందిన అడెల్లి శ్రీ మహా పోచమ్మ నూతన ఆలయం నవంబర్ 7 శుక్రవారం కొత్త విగ్రహ ప్రతిష్ఠాపన, మాలధారణ అక్టోబర్ 28 నుంచి కార్యక్రమాలు ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా భక్తులందరూ పాల్గొని తల్లి ఆశీస్సులు పొందాలని అడెల్లి పోచమ్మ దేవస్థాన కమిటీ చైర్మెన్ సింగం భోజా గౌడ్ తెలిపారు. వేద పండితులు చంద్ర శేఖర్ శర్మ, శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం ఆలయంలో భక్తులకు మాలధారణ ఉంటాదంన్నారు. అమ్మవారి సేవలో పాల్గొను ఆసక్తి ఉన్న భక్తులు ఉదయం ఆలయానికి చేరుకోవాలన్నారు. ఈ సందర్భంగా దేవస్థానం కమిటి,ఆలయ కార్యనిర్వహణ అధికారి భూమయ్య అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ విగ్రహ ప్రతి ష్ఠాపన మహోత్సవంను ఆధ్యాత్మికంగా, సాంస్కృతికంగా వైభవంగా నిర్వహించేందుకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు జరుగుతున్నాయిరు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై ఉత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు.

### లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో
## విద్యార్థులకు గ్లాసుల పంపిణీ




**జన్నారం, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**
జన్నారం మండల లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తోట లచ్చన్న ఆధ్వర్యంలో జన్నారం మండలంలోని కలమడుగు జడ్పీఎస్ఎస్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు 250 స్టీల్ గ్లాసులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టామని, ముందు మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి లయన్ ఎర్ర ప్రవీణ్, లయన్ అనుముల రాజన్న, లయన్ శ్రీకాంత్ రెడ్డి, లయన్ అంజితరావు, లయన్ మల్యాల బాబు, లయన్ కొమురవెల్లి లచ్చన్న, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజమౌళి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నిందితులను కఠినంగా శిక్షించాలి

**ఆసిఫాబాద్, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**
దహేగాం మండలంలో శ్రావణిని హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ.. కుల వివక్ష కారణంగా శ్రావణి హత్యకు గురైందన్నారు. కుల వివక్షకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.



# అమ్మాయి గొంతుతో నమ్మించి





- రూ.8 లక్షలు పోగొట్టుకున్న బాధితుడు
- సూర్యాపేట జిల్లాకు చెందిన ముగ్గురు అరెస్టు
- వివరాలు వెల్లడించిన ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి

**ఆదిలాబాద్, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**
అచ్చం అమ్మాయిల గొంతు మార్చి మాట్లాడుతూ... తీయటి ప్రేమ మాటలతో వలపు వలను విసురుతూ అమాయకులను బుట్టలో దించుతున్న ఓ ముఠాను ఆదిలాబా ద్ పోలీసులు పెట్టకేలకు పట్టుకున్నారు. అమ్మాయిగా గొంతు మార్చి మాట్లాడుతూ... ఓ వ్యక్తి నుండి ఒకటి కాదు రెండు కాదు ఏకంగా ఎనిమిది లక్షల రూపాయలను కాజేసిన ముగ్గురు యువకులను పోలీసులు అరె స్టు చేశారు. ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడి యా సమావేశంలో డీఎస్పీ జీవన్ రెడ్డి వెల్లడించారు. పెళ్లిళ్లకు సంబంధించిన ఓ మ్యాట్రి మోనీలో ఓ అందమైన అమ్మాయి ఫోటో పెట్టి యువకులను బురిడి కొట్టిస్తున్న సూర్యాపేట జిల్లా, మఠంపల్లి మండలం, రామచంద్ర పురం తండాకు చెందిన మాలోత్ మంజి ఏ కృష్ణవేణి, బుక్య గణేష్, రూపావత్ శ్రావణ్ కుమార్‌లను అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి నుండి రూ. 1,50,000 నగదు, మూడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ఎం. లక్ష్మీకాంత్‌కు ఓ మ్యాట్రిమోనీ ద్వారా పరిచయమైన ఈ ముగ్గురు యువకుల్లో మాలోత్ మంజి అనే యువకుడు కృష్ణవేణి పేరుతో అమ్మాయి గొంతులా మార్చి లక్ష్మీకాంత్‌తో మాట్లాడేవారని తెలిపారు. ఫిబ్రవరిలో వీరు పరిచయం ఏర్పడిందన్నారు. అప్పటినుండి లక్ష్మీకాంత్ తరచూ ఈ యువకులకు ఆన్లైన్ ద్వారా నగదును పంపేవాడన్నారు. దీంతో రుచి మరిగిన యువకులు సదరు వ్యక్తిని నమ్మించి కృష్ణవేణి అనే అమ్మాయితో పెళ్లి చేస్తామని బురిడీ కొట్టించి సుమారు రూ. 8 లక్షల రూపాయలు వసూలు చేశారని అన్నారు. గత కొన్ని నెలలుగా డబ్బులు పంపుతు న్న లక్ష్మీకాంత్ మోసపోయానని తెలుసుకొని 1930 ద్వారా సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేయగా, ఈనెల 25వ తేదీన వన్ టౌన్ లో కేసు నమోదు చేశామన్నారు. దీంతో ఎస్పీ అఖిల్ మహాజన ఆదేశాల మేరకు సైబర్ సెల్, వన్ టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయబడిన ప్రత్యేక బృందం సూర్యాపేట జిల్లాకు వెళ్లి ఈ ముగ్గురు నిందితులను పట్టుకొని అరెస్టు చేయడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో ఇన్స్పెక్టర్ ప్రేమ్ కుమార్, సైబర్ సెల్ ఎస్.ఐ గోపికృష్ణ, వన్ టౌన్ అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ గోకుల్ జాదవ్, హెడ్ కానిస్టేబుల్ రమేష్, ఐటీ సెల్ కానిస్టేబుల్ అన్వేష్, సిబ్బంది పాల్గొన్నారు.

### మద్యం షాపులు పొందిన వారు
## వెంటనే నగదు చెల్లించాలి

**నిర్మల్, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**
నూతన ఎక్సైజ్ పాలసీల భాగంగా సోమవారం నిర్వహించిన లక్కీ డ్రాలో మద్యం షాపులు దక్కించుకున్న వారు ప్రభుత్వం సూచించిన మొదటి త్రైమాసిక రుసుమును వెంటనే చెల్లించాలని ఎక్సైజ్ సీఐ అబ్దుల్ రజాక్ తెలిపారు. జిల్లాలో మొత్తం 47 మంది షాపులకు లైసెన్సులను జారీ చేయడం జరుగుతుందని వారు వెంటనే 10 లక్షలు డిపాజిట్ చేయవలసి ఉంటుందన్నారు. ఇందుకోసం ఆన్లైన్ బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉంటాయని మంగళవారంలోపు మొదటి విడత డబ్బు చెల్లించిన వారికి మాత్రమే షాపు అనుమతి ఉంటుందని ఈ అవకాశాన్ని సద్వినించుకోవాలని కోరారు.



## గర్భిణీలకు మెరుగైన వైద్య సేవలు



### వైద్యాధికారి రాజమణి

**నార్నూర్, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**
గర్భిణీలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని వైద్యాధికారి రాజమణి అన్నారు. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో గుంజాల సబ్ సెంటర్ పరిధిలోని గర్భిణీలకు వైద్య పరీక్షలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి మాట్లాడుతూ మాతా శిశువు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే సమతుల్యమైన పోషకాహారాన్ని తినాలని సూచించారు. ప్రతినెల వైద్య పరీక్షలు చేయడంతో పాటు ఐరన్ మాత్రలు, ఇంజక్షన్లు తప్పనిసరిగా తీసుకోవాలని గర్భిణీలకు సూచించారు. అంగన్వాడి కేంద్రాలలో అందించే ఆహారాన్ని తప్పక తినాలన్నారు. పలు సలహా సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈవో తులసీదాస్, సీహెచ్వో లక్ష్మి, సూపర్వైజర్ చరణ్ దాస్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

### మెనూ ప్రకారం
## భోజనం అందించాలి

**భీంపూర్, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**
ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని భీంపూర్ ఎంపీడీవో గోపాల కృష్ణ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గుంజాల ప్రాథమిక పాఠశాలను ఎంపీడీవో సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. హనుమంతు, పంచాయతీ కార్యదర్శి నహ్మతుల్ల ఖాన్, విద్యార్థులు ఉన్నారు.



## వాగ్మారే గౌతం కుటుంబానికి న్యాయం చేయాలి



### దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసన

**ఇంద్రవెల్లి, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**
అటవీ శాఖ అధికారుల వేధింపుల వల్లే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఉట్నూర్ మండలంలోని గొట్టిపటార్ గ్రామానికి చెందిన వాగ్మారే గౌతం కుటుంబానికి న్యాయం చేయాలంటూ దళిత సంఘాలు ఆందోళనకు దిగాయి. దళితుని మృతికి కారణమైన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రాథోడ్ విజయలక్ష్మిని విధుల నుండి తొలగించాలని సోమవారం ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనం నుండి ఫారెస్ట్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. గౌతం కుటుంబానికి న్యాయం చేయాలని నినాదాలతో హోరెత్తించారు. దళిత సంఘాల నాయకులు గౌతం కుటుంబానికి రూ.20 లక్షల రూపాయల ఎక్స్ గ్రేషియాతో పాటు ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండల ఫారెస్ట్ అధికారి సంతోష్ మృతుని తండ్రితో పాటు దళిత సంఘాల నాయకులతో మాట్లాడారు. అప్పటికి ఆందోళనకారులు శాంతించకపోవడంతో అనంతరం దళిత సంఘాల నాయకులతో డీఎఫ్ఓతో ఫోన్ లో మాట్లాడి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. దీంతో దళిత సంఘాల నాయకులు శాంతించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సోన్ కాంబ్లే జితేందర్, కాటం రమేష్, దావుల రమేష్, భారత్ సింగారే, దళిత సంఘాల పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

# గురజాల పోలీస్ స్టేషన్‌ను డీసీపీ ఆకస్మిక తనిఖీ

**బెల్లంపల్లి, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**

క్రమశిక్షణతో విధులు నిర్వర్తించి పోలీసు శాఖకు పేరు తీసుకురావాలని మంచిర్యాల డిసిపి ఏ.భాస్కర్ అన్నారు. సోమవారం మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లి తాళ్ల గురజాల పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో పరేడ్ నిర్వహించి పోలీసులు డీఎస్పీకి గౌరవ వందనం చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. స్టేషన్లోని రిసెప్షన్ కౌంటర్ వద్ద ఫిర్యాదు దారులతో మర్యాదగా స్టేషన్లో నడుచుకోవాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో గ్రామాల వివరాలు, కేసుల వివరాలను తెలుసుకున్నారు. క్రైమ్ రేట్ వివరాలతో పాటు సమస్యాత్మక ప్రాంతాల వివరాలు సేకరించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసులు విధులు క్రమశిక్షణతో నిర్వహించాలని పలు సూచనలు చేశారు.



గ్రామాల్లో చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించి పోలీసుల అంటే ప్రజల్లో నమ్మకం కలిగేలా చూసుకోవాలన్నారు. పోలీస్ స్టేషన్‌లో ఇలాంటి సమస్య తలెత్తిన తన దృష్టికి తీసుకురావాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు క్రమశిక్షణ కలిగిన విధులను నిర్వర్తించాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏసిపి రవికుమార్, ఎస్సై బి.రామకృష్ణ, బెల్లంపల్లి రూరల్ ఎస్సై హనోక్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

**విద్యార్థులకు వ్యాసరచన పోటీలు..**

విద్యార్థులు చదువును కష్టంతో కాకుండా ఇష్టపడి చదవాలని అప్పుడే విజయానికి చేరువగా అవుతారని బెల్లంపల్లి పట్టణ సీఐ శ్రీనివాసరావు అన్నారు. పోలీసు అమరుల సంస్మరణలో భాగంగా బెల్లంపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈసందర్భంగా సిఐ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని



మెలగాలని పలు సూచనలు చేశారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ అంజయ్య, పోలీసు సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.



### ఉప మార్కెట్ యార్డ్‌లో
## పిచ్చి మొక్కలు తొలగింపు

**నార్నూర్, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ ఉప మార్కెట్ యార్డులో వెదజల్లుతున్న దుర్వాసన అనే కథనం 'ప్రభాత సమాచారం'లో ప్రచురితమైంది. పంచాయతీ డివిజన్ అధికారి ప్రభాకర్, నార్నూర్ పంచాయతీ కార్యదర్శి మోతిరామ్ సోమవారం స్పందించారు. పంచాయతీ కార్మికులతో మార్కెట్ పరిసరాలలో పెరిగిన పిచ్చి మొక్కలు తొలగించి శుభ్రపరిచారు. ఇంద్రవెల్లి మార్కెట్ యార్డ్ కార్యదర్శి శ్రీనివాసుని డీఎల్‌పీవో ప్రభాకర్ ఫోన్ లో సమాచారం తెలుసుకున్నారు. పిచ్చి మొక్కల తొలగింపును దగ్గరుండి చేయించారు. పలు విషయాలను జిల్లా ఉన్నత అధికారుల దృష్టికి తీసుకు వెళ్తానని చెప్పారు. ఈయన వెంట నార్నూర్ సహకార సంఘం చైర్మన్ ఆడే సురేష్, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ జాదవ్ కైలాస్, మహమ్మద్ ఖురేషి తదితరులున్నారు.

### తెలంగాణ జాగృతిలో చేరిన
## బీసీ సంఘం నాయకుడు

**మంచిర్యాల, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**

బీసీ సంక్షేమ సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షులు ఉదారి చంద్రమోహన్ గౌడ్ సోమవారం తెలంగాణ జాగృతిలో చేరారు. హైదారాబాద్‌లోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన జాగృతి అధ్య క్షురాలు కవిత కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కవిత నాయకత్వంలో జాగృతిని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు.




# మత్తు పదార్థాలపై అవగాహన

**ఆసిఫాబాద్, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**

పురపాలక సంఘం ఆసిఫాబాద్ ఆధ్వర్యంలో వ్యాపారులకు మత్తు పదార్థాల నిషేధం, వాటి దుష్ప్రభావాలపై సోమవారం కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గజానంద్ మాట్లాడుతూ... ప్రజలను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచడంలో ప్రతి ఒక్కరు తమ వంతు సహకారం అందించాలని కోరారు. పురపాలక సంఘం పరిధిలో వ్యాపారం చేస్తున్న వ్యాపారస్తులు ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని కోరారు. ట్రేడ్ లైసెన్స్ తీసుకోకుండా వ్యాపారం చేసినట్లయితే యజమానులకు పురపాలక చట్టం 2019 ప్రకారం నోటీసులు జారీ చేయడంతో పాటు చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ సర్వర్, టీఎంసీ అరుణ ,మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



# అన్నదాతను వెంటాడుతున్న అకాల వర్షాలు



**నిర్మల్, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**

రైతన్నలు ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికందే దశలో అడవి పందుల బీభత్సం, ఒకపక్క రాష్ట్రంలో పెను తుఫానుతో అకాల వర్షాలు కురవడంతో రైతన్నలకు తీరని నష్టం జరగడంతో రైతన్న ఆశలు నీళ్లపాలు అయింది. వరి పంటను అడవి పందుల బీభత్సానికి ధ్వంసమైన పంటను చూసి రైతన్నలు కన్నీరు మున్నీరు అవుతున్నారు. అడవి పందుల భీభత్సానికి నష్టపోయిన రైతులు వ్యవసాయ అధికారులకు నష్ట పరిహారం చెల్లించాలని ఫిర్యాదు చేసిన అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

**అకాల వర్షానికి రైతన్నకు తీరని నష్టం...**

నిర్మల్ జిల్లా ఖానాపూర్ నియోజకవర్గం లోని కడెం, దస్తురాబాద్, పెంబి, ఖానాపూర్ మండల కేంద్రంలోనూ పెను తుఫానుతో కురుస్తున్న అకాల వర్షాలకు చేతికి అందే మొక్కజొన్న, పత్తి, వరి పంట పూర్తిగా దెబ్బతినడం తో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖానాపూర్ మండలంలోని సూర్జపూర్ గ్రామానికి చెందిన జంగిలి రాజేందర్ అనే రైతు మూడు ఎకరాల భూమిని కౌలుకు తీసుకోని వరి పంట సాగు చేసుకోగ వరి పంట కోత దశలో వచ్చిన వరి పంట మూడు రోజుల క్రితం కురిసిన అకాల వర్షానికి నేల పాలు కావడంతో ఆ రైతు ఆందోళన చెందాడు. రాష్ట్ర ప్రభుత్వం నష్టపోయిన పంటకు నష్టపరిహారం చెల్లించాలని అధికారులకు విన్నవించుకున్నాడు. కానీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు . అధికారులు స్పందించి నష్టపోయిన వరి పంటకు నష్టపరిహారం చెల్లించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

**అడవి పందుల బీభత్సానికి వరి పంట ధ్వంసం..**

మండలంలోని బీర్నంది గ్రామ పంచాయతీ పరిధిలో ని తోట చిన్న లచ్చన్న అనే రైతు నాలుగు ఎకరాల పొలంలో వరి సాగు చేసుకోగ అడవి పందుల బీభత్సానికి వరి పంటను పూర్తిగా ధ్వంసం చేయడంతో ఆ రైతు తల పట్టుకున్నాడు. ఆరుగాలం కష్టపడి పండించిన వరి పంట చేతికి అందే దశలో అడవి పందులు పంటను నాశనం చేసింది అని ఆ రైతు ఆవేదన చెందారు. అటవీ పందుల బారి నుండి పంటను కాపాడుట కోసం పొలం చుట్టూ జీయా వైర్ ను కంచె గా వాడితే అటవీ అధికారులు కేసులు పెడుతున్నారు అని అని ఆయన తెలిపారు. అటవీ అధికారులు అడవి పందుల బారి నుండి పంటలను కాపాడాలని, పంటకు నష్టపరిహారం చెల్లించాలని ఆ రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



### ఆదివాసీ దేవతలకు
## రక్షణ కల్పించి అభివృద్ధి చేయాలి

**కాసిపేట, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**

ఆదివాసీ గిరిజన దేవతలకు, దేవాలయాలను, దేవస్థానాలకు రక్షణ కల్పించి అభివృద్ధి చేయాలని ఆదివాసీలు కోరారు. ఈ మేరకు సోమవారం మంచిర్యాల జిల్లా కాసిపేట మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సునీల్, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీవో శేఖ్ సప్తర్ అలీకి, తదితర అధికారులకు ఆదివాసీ గిరిజనులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గిరిజన సంస్కృతి దేవతలు, దేవాలయాలు, దేవ స్థానాలు గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక పథకం ద్వారా రక్షణ కల్పిస్తూ అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. గిరిజన దేవాలయాలు, దేవ స్థానాలు అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. మద్య ప్రదేశ్ ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖ ద్వారా ప్రత్యేక పథకం ద్వారా అభివృద్ధి చేస్తుందని, తెలంగాణ రాష్ట్రంలో కూడా అభివృద్ధి చేయాలని కోరారు. ఆదివాసీ గిరిజన కుటుంబ దేవతలు, గ్రామ దేవతలు, వంశ కుల దేవతలు, గిరిజన సంస్కృతి మా దేవతలకు రక్షణ కల్పించి అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోయ పున్నెం రాయ్ సభ అధ్యక్షులు పెంద్రం హన్మంతు, ప్రధాన కార్యదర్శి ఆడే జంగు, మండల సర్మేడి సిడం జంగు, మండల గీతదార్ సిడం గణపతి, పెంద్రం ప్రభాకర్, అర్క జైతు, కోవ గణపతి, ఆడె జంగు, సిడం రమేష్, కుర్సింగ సూరు, కోవ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## జీఎస్టీ తగ్గింపు సామాన్యుడికి వరం
### ఆదిలాబాద్ ఎంపీ నగేశ్

**ఇచ్చోడ, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**

దేశ ప్రధాని నరేంద్ర మోడీ జీఎస్టీ తగ్గించడం వలన సామాన్యునికి వరంలా మారిందని ఆదిలాబాద్ ఎంపీ నగేశ్ పేర్కొన్నారు. ఇచ్చోడ మండల కేంద్రంలోని మార్కెట్ పరిసర ప్రాంతాలలో వ్యాపారులను కలిసి వారితో ముచ్చటించారు. జీఎస్టీ తగ్గింపు వల్ల కలిగే లా భాలను వారికి వివరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అందరి సంక్షేమం కోసం పనిచేస్తుందని తెలిపారు.




# బీసీలకు రిజర్వేషన్ల అమలు బాధ్యత కేంద్రానిదే

**జన్నారం, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**

బీజేపీ వైఖరి దొంగే దొంగ అన్నట్లు ఉన్నదని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు చేసే బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని సీపీఐ (ఎం) మండల కార్యదర్శి కొండ గొర్ల లింగన్న అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్లను బీజేపీ అడ్డుకోవడంతోనే చట్టబద్ధత కాలేదని అన్నారు. ఈనెల 18న జరిగే బంద్ను విజయవంతం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ తీరును ఎండగట్టే విధంగా ఈ బంద్ సాగాలన్నారు. బీసీ రిజర్వేషన్లు 42 శాతం సాధించేందుకు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో బీసీ సంఘాలు, అభ్యుదయ వాదులు, ప్రజాతంత్ర వాదులు భాగస్వాములు కావాలని కోరారు. అసెంబ్లీలో అన్ని రాజకీయ పార్టీల మద్దతుతో ఏకగ్రీవంగా ఆమోదించిన బిల్లును, కేంద్ర ప్రభుత్వానికి పంపితే ఆరు నెలలైనా కేంద్రం స్పందించడంలేదన్నారు. కార్యక్రమంలో మండల కమిటీ నాయకులు అంబటి లక్ష్మణ్, మగ్గిడి జయ, నాయకులు అబ్దుల్లా, బుచ్చయ్య, రాజన్న పాల్గొన్నారు.



# అవినీతి నిర్మూలనే విజిలెన్స్ లక్ష్యం

**మందమర్రి, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**
ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణిలో అవినీతి నిర్మూలనే లక్ష్యంగా విజిలెన్స్ విభాగం పనిచేస్తుందని ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ ఎన్ రాధాకృష్ణ అన్నారు. ఏరియా జిఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్లో విజిలెన్స్ అవగాహన వారోత్స వాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా జిఎం మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ సంస్థలతో పాటు, సింగరేణిలో ఈ నెల 27 నుండి నవంబర్ 2వ తేదీ వరకు విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు సింగరే ణిలోని అన్ని గనులు డిపార్ట్మెంట్ లలో నిర్వహించడం జరుగు తుందన్నారు. సింగరేణి సంస్థలో అవినీతికి వ్యతిరేకంగా విజిలెన్స్ విభాగం పనిచేస్తుందన్నారు. అవినీతికి వ్యతిరేకంగా ఉద్యోగులందరినీ చైతన్యపరిచి అవినీతి నిర్మూలనలో భాగస్వాములను చేయటమే విజిలెన్స్ అవగాహన



వారోత్సవాల ముఖ్య ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. సింగరేణి సంస్థలో ఏమైనా అక్రమాలు జరుగుతున్నాయని గుర్తిస్తే వెంటనే విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేయాలని, ఫిర్యాదుదారుల పేర్లు, వివరాలు గోప్యంగా ఉంచబడతాయ న్నారు, దేశ ప్రగతికి అవరోధం అయిన అవినీతిని నిరోధించు బాధ్యత ప్రతి ఉద్యోగి తీసుకోవాలని కోరారు. అవినీతి వలన దేశానికి, ఆయా సంస్థలకు జరిగే నష్టాన్ని గుర్తించి అక్రమా లకు వ్యతిరేకంగా పోరాడినప్పుడే ఈ సమస్యను అధిగమిం చగలమన్నారు. వారోత్సవాలలో భాగంగా సింగరేణి ఉద్యో గులకు, అధికారులకు వ్యాసరచన పోటీలు, సింగరేణి పాఠ శాల విద్యార్థులకు వకృత్వ పోటీలు నిర్వహించడం జరుగు తుందన్నారు. అనంతరం కార్యాలయం ఉద్యోగులతో విజి లెన్స్ “సమగ్రత ప్రతిజ్ఞ” చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జిఎం విజయ్ ప్రసాద్, ఎఐటియుసి బ్రాంచ్ సెక్ర టరీ సలేంద్ర సత్యనారాయణ, పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాం సుందర్, సిఎంఓఏఐ జాయింట్ సెక్రటరీ రవి, సీనియర్ పీఓ సత్యనారా యణ, జిఎం ఆఫీస్ హెచ్ఓడి లు, అధికా రులు, ఉద్యోగులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



### పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా
## ఖానాపూర్ వాసికి ప్రశంస

**ఖానాపూర్, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**
జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో జరిగిన ఫ్లాగ్ డే సంద ర్భంగా ఖానాపూర్ వాసి షౌకత్ పాషాకు జిల్లా ఎస్పీ జానకి షర్మిల చేతుల మీదుగా ప్రశంసా పత్రం అం దించారు. ఫ్లాగ్ డే సందర్భంగా పోలీసులు జిల్లా కేం ద్రంలో సోమవారం ఏర్పాటుచేసిన మెగా బ్లడ్ డొనేషన్ సందర్భంగా రక్త దానం చేసిన మాజీ ఆర్మీ, ఖానాపూర్ కాంగ్రెస్ పార్టీ పట్టణ మైనార్టీ అధ్యక్షులు ఆయన షౌకత్ పాషాను ఈ సందర్భంగా ప్రశంసించారు.

## సమాజ రక్షణ కోసమే పోలీసులు



**లక్షెట్టిపేట, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**
సమాజ రక్షణ కోసం పోలీసులు పని చేస్తున్నారని లక్షెట్టిపేట ఎస్సై సురేష్ అన్నారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి లక్షెట్టిపేట పట్టణంలోని గాంధీ చౌక్ నుండి ఉత్కూరు చౌరస్తా వరకు పోలీసులు, ప్రముఖులు క్యాండిల్ ర్యాలీ నిర్వ హించారు. ప్రతి ఒక్కరి రక్షణ బాధ్యతను నిర్వహి స్తూ పోలీసులు శాంతి భద్రతలను కాపాడుతున్నారన్నారు.

## అధికారులు ఉత్పత్తి లక్ష్యాలపై దృష్టి పెట్టాలి

**రెబ్బెన, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**
అధికారులు ఉత్పత్తి లక్ష్యాలపై దృష్టి పెట్టాలని ప్లానింగ్ అండ్ ప్రాజెక్టు డైరెక్టర్ కె వెంకటేశ్వర్లు సూచించారు. బెల్లంపల్లి సింగరేణి ఏరియాలో ప్లానింగ్ అండ్ ప్రా జెక్టు డైరెక్టర్ వెంకటేశ్వర్లు జీఎం ఎం విజయభాస్కర్ రెడ్డితో కలిసి పర్యటిం చారు. అనంతరం జీఎం కా ర్యాలయంలో అన్ని విభాగాల అధిపతులతో సమావేశం నిర్వహించి గోలేటి ఉపరితల గని పనుల ప్రగతిని సమీ క్షించారు. వర్షాలు తగ్గుముఖం పట్టినందున ఉత్పత్తి లక్ష్యాలపై దృష్టి పెట్టా లన్నారు. నిత్యం 15వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలన్నారు. అనంతరం కైరిగూడ ఓసీ నుంచి పనిస్థలాలను తనిఖీ చేశారు. ఉత్పత్తిలో భాగస్వాములు అవుతున్న మహిళా ఉద్యోగులతో మా ట్లాడారు. మగ వారితో సమానంగా వారు చేస్తున్న పనులను చూసి అభినందించారు. బ్లాస్టింగ్ పనులు ఎలా చేస్తున్నారో ఉద్యోగులు డైరెక్టర్కు వివరించారు. ఇలాగే పనిచేస్తే పదోన్నతులు త్వరగా కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో పీవో నరందర్, ఏరియా ఇంజనీర్ కృష్ణ మూర్తి, ఎస్ఓటు జీఎం రాజమల్లు, ఉన్నారు.



### రైతులతో చర్చించి పత్తి
## కొనుగోలు సమస్య పరిష్కారం
### ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**
అదిలాబాద్ మార్కెట్ యార్డ్ లో పత్తి కొనుగోలు అంశంపై జిల్లా కలెక్టర్ రాజర్షి షా, శాసనసభ్యులు పాయల్ శంకర్ తో కలిసి సోమవారం ఏర్పాట్లను పరిశీలించి రైతులతో మాట్లాడారు. జిల్లాలో మార్కెట్ యార్డ్ పరిధిలో మొత్తం 17 ప్రైవేట్ జిన్నింగ్ మిల్లులు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. రైతుల సమస్యలపై అధికారులు, మిల్లుల యజమానులు, రైతులు కలిసి రెండు గంటల పాటు చర్చించి ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నారని చెప్పారు. 12 శాతం తేమ కలిగిన పత్తిని నేరుగా సీసీఐ కొనుగోలు చేస్తుందని, 12 శాతం పైగా తేమ ఉన్న పత్తిని మాత్రం ఈరోజు మాత్రమే ప్రైవేట్ జిన్నింగ్ మిల్లులు రూ.6,950 ధరకు కొనుగోలు చేయాలని నిర్ణయించడం జరిగిందని తెలిపారు. రైతుల సౌకర్యార్థం జిల్లా యంత్రాంగం పలు ఏర్పాట్లు చేపట్టిందని, వర్ష సూచన ఉన్న నేపథ్యంలో రైతులు పత్తిని తగిన రక్షణ చర్యలతో మార్కెట్ కు తీసుకురావాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. రైతుల కోసం మార్కెట్ యార్డ్లో భోజన వసతి కూడా ఏర్పాటు చేయడం



జరిగిందని తెలిపారు. శాసనసభ్యులు పాయల్ శంకర్ మాట్లాడుతూ, రైతుల కోసం జిల్లా కలెక్టర్ చేసిన చర్యలు ప్రశంసనీయం అని అన్నారు. మార్కెట్ యార్డ్ లో భోజన సదుపాయం, ఇతర అవసరమైన ఏర్పాట్లు చేయడం పట్ల కలెక్టర్ కు ధన్యవాదాలు తెలిపారు. రైతులందరూ జిల్లా యంత్రాంగానికి పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సీడ్స్ నోడల్ అధికారి కేశవులు, మార్కెటింగ్ ఏడీ గజానంద్, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులు, రైతు సంఘాల ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## బుగ్గ రాజరాజేశ్వరునికి అన్నపూజ

**బెల్లంపల్లి, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**
శ్రీ బుగ్గ రాజరాజేశ్వరునికి మొదటి కార్తీక సోమవారం సందర్భంగా ఘనంగా అన్న పూ జ నిర్వహించారు. దేవస్థాన అర్చకులు సతీష్ శర్మ వేదమంత్రోచరణల మధ్య స్వామి వారికి అన్న సమర్పణ చేశారు. ఈ అపురూప ఘట్టాన్ని భక్తులు కన్నుల నిండుగా దర్శిం చుకున్నారు. దేవస్థానం వద్ద మహిళలు కార్తీక దీపోత్సవం నిర్వహించారు. శ్రీ వాసవి భజన బృందం సహాయక సంఘం సభ్యులు భజన కార్యక్రమాన్ని చేపట్టారు. భారీగా తరలివచ్చిన భక్తులకు అన్నదానం నిర్వహించారు.



### పాపం పసిపాపను రైలులో
## వదిలిపెట్టి వెళ్లిన వైనం
### బాల రక్షా భవన్‌కు తరలింపు



**ఆసిఫాబాద్, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**
అభం శుభం తెలియని పసిపాపను కనికరం లేని వ్య క్తులు ట్రైన్‌లో వదిలిపెట్టిన సంఘటన అందరి మన సును కలిచివేసింది. సికింద్రాబాద్ నుంచి పాట్నాకు వెళ్తున్న దానాపూర్ ఎక్స్ప్రెస్ రైలులో గుర్తు తెలియని తల్లి సుమారు రెండు నెలల పసిపాపను వదిలి వెళ్లిపోయిన ఘటన చోటు చేసుకుంది. పాపను గమనించి వెంటనే కాగజ్‌నగర్ రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. రైల్వే స్టేషన్‌లో పాపను తమ ఆధీనంలోకి తీసుకున్న రైల్వే పోలీసులు.. జిల్లా బాలల సంరక్షణ అధికారి మహేష్ బూర్లాకు సమాచారం అందించడంతో అక్క డికి చేరుకున్న జిల్లా బాలల సంరక్షణ విభాగం, సిబ్బంది పాపను స్వాధీనం చేసుకొని బాల రక్షా భవన్ కు తరలించారు. ఈ సందర్భంగా జిల్లా మహిళ శిశు సంక్షేమ అధికారి డాక్టర్ భాస్కర్ మాట్లాడుతూ పాపను అదిలాబాద్ లోని గృహానికి తరలించడం జరుతుందని చెప్పారు. పాపను చట్టబద్ధంగా శిశు గృహం ద్వారా అవసరమైన వారికి దత్తత ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాల రక్షా భవన్ సిబ్బంది శ్రావణ్ కుమార్, జమున, చంద్రశేఖర్, బాల ప్రవీణ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



## నిర్మాణాలను వేగవంతం చేయాలి

**భీంపూర్, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**
ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ఇందిరమ్మ ఇళ్ల నిర్మా ణాలను లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసుకోవాలని ఆది లాబాద్ పార్లమెంటు సభ్యుడు గోడం నగేశ్ సూచిం చారు. భీంపూర్ మండలంలో సోమవారం ఆయన పర్య టించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు అశోక్, నాయకులు, గ్రామస్తులు తదితరులున్నారు.


## అవినీతిని నిర్మూలిస్తేనే దేశ పురోభివృద్ధి
### పారదర్శకతకు మరో పేరు సింగరేణి
### ప్లానింగ్ అండ్ ప్రాజెక్టు డైరెక్టర్ కె వెంకటేశ్వర్లు

**రెబ్బెన, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**
అవినీతిని నిర్మూలిస్తేనే దేశ పురోభివృద్ధి సాధ్యమని, దేశంలోనే అత్యంత పారదర్శకత ఉన్న సంస్థ సింగరేణి అని ప్లానింగ్ అండ్ ప్రాజెక్టు డైరెక్టర్ కె వెంకటేశ్వర్లు అన్నా రు. సోమవారం గోలేటి జీఎం కార్యాలయం ఆవరణలో నిర్వహించిన విజిలెన్స్ వారోత్సవాల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై జీఎం విజయ భాస్కర్‌రెడ్డితో కలిసి గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భం గా డైరెక్టర్ కె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రస్తుతం సాంకేతిక పెరిగిపోయిందని ఎదుటి వారితో మాట్లాడే టప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. అవినీతి ఏ రంగంలో అయినా అభివృద్ధికి అడ్డంకిగా మారుతుందని ఫలితం దేశ పురోభివృద్ధిపై ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. అవినీతి లేకుంటే సమాజం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందని అన్నారు. అనంతరం అవినీతికి వ్యతిరేకంగా నిజాయి తీగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకుడు కిరణ్, డీజీఎం ఉజ్వల్‌కు మార్ బెహారా, ఏరియా ఇంజనీర్ కృష్ణమూర్తి, ఎస్‌వోటు జీఎం రాజమల్లు, పర్సనల్ హెచ్‌వోడీ శ్రీనివాస్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



## బాలీవుడ్‌పై పంచ్

ఒకరిని పొగడటం అంటే ఇంకొకరిని తిట్టడం కాదు! కానీ ఇక్కడ శ్రుతిహాసన్ దక్షిణాది చిత్రసీమ గురించి ప్రశంసలు కురిపించిన తీరు కచ్చితంగా హిందీ చిత్రసీమతో పోలికలు, లోపాలను బహిర్గతం చేసింది. దక్షిణాది పరిశ్రమలో ప్రతిదీ క్రమశిక్షణతో నడిపిస్తారు. ఇక్కడ సంస్కృతి సాంప్రదాయం గొప్పవి. కొబ్బరి కాయ కొట్టి, పూజలు పునస్కారాలతో సినిమాల ప్రారంభోత్సవాలు ఘనంగా చేస్తారు. సాంప్రదాయాలు ఆచారాలను నమ్ముతారు. ఇక్కడ వినయం గౌరవంలో తగ్గరు. సెట్లో నియమాలను అందరూ పాటిస్తారని హిందీ పరిశ్రమలో ఇలాంటివి చూడలేదు అని తెలిపారు. నిజానికి కొంత కాలంగా హిందీ చిత్రసీమలో క్రమశిక్షణా రాహిత్యం గురించి చాలా చర్చ సాగుతోంది. స్టార్లకు ఇష్టానుసారం ఆలస్యంగా సెట్స్ కి వచ్చే అలవాటు ఉంది. అభినవ్ కశ్యప్ లాంటి దర్శకుడు పదే పదే ఖాన్‌ల త్రయం క్రమశిక్షణా రాహిత్యం గురించి విమర్శిస్తున్నారు. క్వీన్ కంగన రనౌత్ చాలా సందర్భాల్లో ఉత్తరాది అగ్ర హీరోల ఆధిపత్య ధోరణి, మనస్తత్వంపై చాలా చెణుకులే వేసారు. దక్షిణాది పరిశ్రమలో గౌరవం ఇచ్చి పుచ్చుకునే విధానం గురించి, వర్క్ కల్చర్ గురించి ప్రశంసలు కురిపించిన కంగన, ఉత్తరాది స్టార్ల క్రమశిక్షణా రాహిత్యాన్ని దెప్పి పొడిచింది. ఇటీవల అనురాగ్ కశ్యప్ సైతం ఉత్తరాది పరిశ్రమలో క్రమశిక్షణ సరైన నడవడిక లేకపోవడం వల్ల సౌత్ కి వచ్చేశానని తెలిపారు. ప్రస్తుతం ఆయన ఇక్కడే నటిస్తూ, దర్శకుడిగాను కొనసాగుతున్నారు. ఇటీవల ఓ సినిమా మేకింగ్ విషయంలో తలమునకలుగా ఉన్నారు కశ్యప్. ప్రేమ.. పని... ఉద్యోగం గురించి నిజాయితీగా మాట్లాడితే సమాజం హర్షించదని కూడా శ్రుతి వ్యాఖ్యానించింది. నిజం మాట్లాడితే ఎదుటివారిని జనం వేలెత్తి చూపిస్తారని పేర్కొంది. తన కాస్మొటిక్ సర్జరీల గురించి నిజాయితీగా బహిరంగంగా మాట్లాడినందుకు జనం ఇలానే ప్రవర్తిస్తారని అంది. బయట ఎవరో ఏదో అనుకుంటారని నన్ను నేను మార్చుకోలేను.. నాలాగే నేను ఉంటాను! అని తెలిపింది.



## పవన్ ఒప్పుకుంటాడా ?

ఇండస్ట్రీలో కొన్ని స్క్రిప్టుల జర్నీ చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది. ఒక హీరో కోసం రాసిన కథ, ఎన్నో మలుపులు తిరిగి, ఫైనల్‌గా మరో హీరో దగ్గర లాక్ అవుతుంది. ఇప్పుడు డైరెక్టర్ వంశీ పైడిపల్లి చేతిలో అలాంటి స్క్రిప్ట్ ఒకటి ఉందని, అది ఇప్పుడు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. 'మహర్షి', 'వారసుడు' లాంటి పెద్ద సినిమాల తర్వాత, వంశీ చాలా గ్యాప్ తీసుకున్నారు. గత రెండు, మూడేళ్లుగా ఆయన ఒక పవర్ ఫుల్ 'సోషల్ డ్రామా' కథపై పనిచేస్తున్నారని టాక్. ఇది రెగ్యులర్ కమర్షియల్ సినిమా కాదని, సమాజాన్ని కదిలించే పాయింట్‌తో ఉంటుందని అంటున్నారు. నిజానికి వంశీ ఈ స్క్రిప్ట్‌ను ముందుగా టాలీవుడ్ హీరోల కోసం రాయలేదట. ఆయన ప్లానింగ్ మొత్తం బాలీవుడ్ మీదే ఉందని సమాచారం. ఇండస్ట్రీలో వినిపిస్తున్న క్రేజీ బజ్ ప్రకారం, వంశీ పైడిపల్లి మొదట ఈ కథను మిస్టర్ పర్‌ఫెక్షనిస్ట్ ఆమిర్ ఖాన్‌కు వినిపించారట. ఆమిర్‌కు కథ బాగా నచ్చిందని, వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని, ప్రొడ్యూసర్ దిల్ రాజు అడ్వాన్స్ కూడా పే చేశారని, అనౌన్స్‌మెంట్ డేట్ కూడా లాక్ చేశారని టాక్ వచ్చింది. కానీ, చివరి నిమిషంలో ఏమైందో ఏమో, ఆమిర్ ఖాన్ ఆ ప్రాజెక్ట్ నుంచి సైలెంట్‌గా తప్పుకున్నారట. ఆమిర్ ఖాన్ హ్యాండ్ ఇవ్వడంతో, వంశీ ఆశలు వదులుకోలేదు. అదే స్క్రిప్ట్‌ను తీసుకుని, బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్ దగ్గరికి వెళ్లారట. ఆమిర్ కాదన్న కథను సల్మాన్ ఓకే చేస్తాడని ఆశించారు. కానీ, అక్కడ కూడా ఆ డీల్ మెటీరియలైజ్ అవ్వలేదని, సల్మాన్ ఖాన్ కూడా ఈ సోషల్ డ్రామాకు ఇంట్రెస్ట్ చూపించలేదని అంటున్నారు. ఇలా ఇద్దరు టాప్ ఖాన్స్ చేతులు మారిన ఆ స్క్రిప్ట్, ఇప్పుడు ఫైనల్‌గా తిరిగి టాలీవుడ్‌కు, అందులోనూ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ దగ్గరికి వచ్చిందని గట్టిగా ప్రచారం జరుగుతోంది. వంశీ పైడిపల్లికి ఆస్థాన నిర్మాత అయిన దిల్ రాజు, ఇప్పుడు ఇదే సోషల్ డ్రామా కథను పవన్ కళ్యాణ్‌తో తీయాలని ప్లాన్ చేస్తున్నారట. పవన్ కళ్యాణ్ ప్రస్తుత పొలిటికల్ ఇమేజ్‌కు, ఆయన ఐడియాలజీకి ఇలాంటి 'సోషల్ డ్రామా' పర్ఫెక్ట్‌గా సెట్ అవుతుందని దిల్ రాజు భావిస్తున్నారట. ఒకవేళ ఈ కాంబినేషన్ సెట్ అయితే, ఇది చాలా పెద్ద ప్రాజెక్ట్ అవుతుంది. కానీ, ఇద్దరు బాలీవుడ్ టాప్ స్టార్లు వద్దనుకున్న కథను పవన్ కళ్యాణ్ ఓకే చేస్తారా లేదా అనేది తెలియాలంటే ఇంకొంత కాలం ఆగాల్సిందే.





## మాస్ జాతర రిలీజ్ పోస్ట్ పోన్..?

మాస్ మహారాజా రవితేజ (Raviteja) కథానాయకుడిగా నటిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం "మాస్ జాతర". ఈ సినిమాలో యంగ్ బ్యూటీ శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తోంది. దర్శకత్వ బాధ్యతలు భాను భోగవరపు నిర్వర్తిస్తున్నారు. సినిమా శ్రీకర స్టూడియోస్ సమర్పణలో, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్ మంచి రెస్పాన్స్ సొంతం చేసుకుంది. రవితేజ మాస్ యాక్షన్, డైలాగ్స్, పోలీస్ గెటప్‌లోని సీన్లు బాగా ఆకట్టుకుంటున్నాయి. శ్రీలీల-రవితేజ జోడీ ధమాకా తర్వాత రెండవసారి స్క్రీన్ మీద కలిసింది. ఈ కాంబినేషన్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. చిత్రాన్ని గత ఏడాది దీపావళికి రిలీజ్ చేయాలని ప్లాన్ చేసారు. కానీ అనేక కారణాల చేత రిలీజ్ వాయిదా పడింది. ప్రస్తుతం విడుదల అక్టోబర్ 31, 2025కి ఫిక్స్ అయినప్పటికీ, SS రాజమౌళి దర్శకత్వంలో రీరిలీజ్ అవుతున్న బాహుబలి ఎపిక్ అదే రోజు రిలీజ్ కు రావడం కారణంగా మేకర్స్ మాస్ జాతర ప్రీమియర్స్‌ను 31న పెట్టి నవంబర్ 1 నుండి రెగ్యులర్ రిలీజ్ ఆలోచనలో ఉన్నారు. లవ్, యాక్షన్, థ్రిల్లర్ అన్ని కలిపి మాస్ జాతరలో రవితేజ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనున్నారు. శ్రీలీల-రవితేజ మధ్యని రొమాంటిక్ సన్నివేశాలు, యాక్షన్ సీక్వెన్స్‌లు ప్రేక్షకులను ఆకట్టే విధంగా ఉంటాయి. మేకర్స్ ఇప్పటికే హైప్ పెంచడానికి ప్రమోషనల్ స్టఫ్ విడుదల చేస్తున్నారు. చివరిగా, అక్టోబర్ 27, 2025న సినిమా ట్రైలర్ను విడుదల చేయనున్నారు. ఇది అభిమానుల్లో సినిమా పై మరింత ఉత్సాహం పెంచింది. సినిమా ప్రీమియర్స్ డేట్స్, రెగ్యులర్ షోస్ పై త్వరలో క్లారిటీ SS రానుంది. మొత్తానికి, మాస్ జాతర రవితేజ యాక్షన్, డైలాగ్స్, శ్రీలీల రొమాంటిక్ టచ్‌తో ప్రేక్షకులకు సూపర్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇవ్వడానికి సిద్ధమవుతోంది. ఈ సినిమా రవితేజ కెరీర్‌లో మూడవ డబుల్ హిట్ను సాధించే అవకాశం ఉంది.



బాలీవుడ్ స్టార్ యాక్టర్ సల్మాన్ ఖాన్‌పై పాకిస్తాన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇటీవల సౌదీ అరేబియాలో జరిగిన ఓ కార్యక్రమంలో సల్మాన్ ఖాన్ చేసిన వ్యాఖ్యలకు ప్రతిగా, ఆయనను 'ఉగ్రవాది'గా ప్రకటిస్తూ పాకిస్తాన్ అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికారిక నోటిఫికేషన్‌ను జారీ చేసింది. రియాద్‌లో జరిగిన 'జాయ్ ఫోరమ్ 2025'లో పాల్గొన్న సల్మాన్ ఖాన్, మధ్యప్రాచ్య దేశాలలో పనిచేస్తున్న దక్షిణ ఆసియా వలసదారుల గురించి మాట్లాడుతూ, "బలూచిస్తాన్ ప్రజలు, ఆఫ్ఘనిస్తాన్ ప్రజలు, పాకిస్తాన్ ప్రజలు అందరూ సౌదీ అరేబియాలో కష్టపడి పనిచేస్తున్నారు" అని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలలో, సల్మాన్ ఖాన్ బలూచిస్తాన్‌ను పాకిస్తాన్ నుంచి ప్రత్యేకంగా పేర్కొనడం పాకిస్తాన్ ప్రభుత్వానికి కోపం తెప్పించింది. బలూచిస్తాన్‌లో పాకిస్తాన్ నుంచి విముక్తి కోసం సుదీర్ఘకాలంగా పోరాటం జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో, సల్మాన్ ఖాన్ వ్యాఖ్యలు బలూచిస్తాన్ వేర్పాటువాద ఉద్యమానికి మద్దతునిచ్చేలా ఉన్నాయని పాక్ ప్రభుత్వం భావించింది. దీంతో, పాకిస్తాన్ ప్రభుత్వం సల్మాన్ ఖాన్‌ను 1997 ఉగ్రవాద నిరోధక చట్టంలోని 'నాల్గవ షెడ్యూల్'లో చేర్చింది. ఈ జాబితాలో చేర్చబడిన వ్యక్తులు ఉగ్రవాద కార్యకలాపాలతో సంబంధం కలిగి ఉన్నట్లు అనుమానించబడినందున, పాకిస్తాన్ చట్టాల ప్రకారం వారు అనేక ఆంక్షలకు లోబడి ఉంటారు. సల్మాన్ ఖాన్ వ్యాఖ్యలను బలూచిస్తాన్ వేర్పాటువాద నాయకులు స్వాగతించి, ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. అయితే, ఈ వివాదంపై సల్మాన్ ఖాన్ లేదా ఆయన ప్రతినిధుల నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక స్పందన రాలేదు. ఉగ్రవాదానికి మద్దతునిస్తున్న పాకిస్తాన్‌కు, సొంత దేశ అంతర్గత విభేదాలపై అంతర్జాతీయంగా ప్రముఖుడి వ్యాఖ్యలు కొత్త తలనొప్పిగా మారాయి. అంతర్జాతీయ వేదికపై ఈ అంశంపై చర్చ మొదలవడం పాక్‌కు ఇబ్బందికరంగా మారింది.

## సల్మాన్ ఖాన్‌ని 'ఉగ్రవాది'గా ప్రకటించిన పాకిస్తాన్

# ఆదిలాబాద్‌లో ప్రశాంతంగా లాటరీ ప్రక్రియ

- కలెక్టర్ సమక్షంలో లక్కీడ్రా పూర్తి
- 34 షాపులకు గాను టెండర్ పూర్తి
- మిగతా ఆరు షాపులకు త్వరలో టెండర్



**ఆదిలాబాద్, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో మద్యం దుకాణాల కేటాయింపునకు సంబంధించిన లాటరీ ప్రక్రియను సోమవారం స్థానిక రత్న గార్డెన్‌లో జిల్లా కలె క్టర్ రాజార్షి షా పారదర్శకంగా నిర్వహించారు. ఈ లక్కీ డ్రా కార్యక్రమంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కే. రఘు రామ్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ హిమశ్రీ, ఎక్సైజ్ సీఐ విజేందర్, మద్యం దుకాణాల దరఖాస్తుదారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఎక్సైజ్ పాలసీ (2025-2027) ప్రకారం మొత్తం 40 మద్యం షాపుల కేటాయింపులో, 34 షాపులు లక్కీ డ్రా ద్వారా కేటాయించబడ్డాయి. 10 కంటే తక్కువ దరఖాస్తులు వచ్చిన షాపులకు డ్రా నిర్వహించకుండ, వాటి కోసం మళ్లీ రీ-టెండర్ నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. వీటిలో ఆదిలాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని షాప్ నం. 16,17,18 తాంసి, తలమడుగు, భీంపూర్ షాపులకు వాయిదా పడింది. అలాగే ఇచ్చోడ పరిధిలో షాప్ నం.25, 28 అడెగామ, సిరికొండ, ఉట్నూర్ స్టేషన్ పరిధిలో షాప్ నం.40 లోకారికి లక్కీడ్రా వాయిదా వేశారు. లక్కీడ్రా కోసం వందల సంఖ్యలో టెండర్ దారులు, వారి సంబంధికులు రావడంతో సందడి వాతావరణం నెలకొంది. లక్కు దక్కిన వారు చలాన్ తీసేందుకు బ్యాంక్ కౌంటర్లు ఏర్పాటు చేశారు. టెండర్ దారులకు పాస్ లు కేటాయించారు. పాస్‌లు ఉన్నవారికే లోపలికి అనుమతించారు. సెల్ ఫోన్ లోనికి అనుమతించకుండా సెల్ ఫోన్ భద్రపరిచేందుకు కౌంటర్ ఏర్పాటు చేశారు. టెండర్ దారులు ఆసక్తిగా పాల్గొని తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. షాప్ దక్కినవారు ఆనందంలో మునిగిపోగా లక్కు కలిసిరాని వారు నిరాశ చెందారు. ప్రతి షాపునకు సంబంధించిన దరఖాస్తుల ఆధారంగా టోకెన్ నంబర్లు కేటాయించి, దరఖాస్తుదారుల సమక్షంలో కలెక్టర్ స్వయంగా లక్కీ డ్రా నిర్వహించారు. డ్రా ప్రారంభం నుంచి ముగింపు వరకు మొత్తం ప్రక్రియను ఫోటో, వీడియో రికార్డింగ్ చేయడం ద్వారా పూర్తి పారదర్శకతతో నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో ఎటువంటి అవాంతరాలు లేకుండా సాగేందుకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. భద్రతా పరమైన దృష్ట్యా భారీ పోలీసు బందోబస్తు కూడా ఏర్పాటు చేశారు. లక్కీ డ్రాలో ఎంపికైన వారికి లైసెన్స్ ఫీజు చెల్లింపునకు అవసరమైన సదుపాయాలను వేదికపైనే కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది, దరఖాస్తుదారులు పాల్గొన్నారు.








## శభరిమలకు పాదయాత్ర

**శ్రీరాంపూర్, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ కాలనీకి చెందిన అయ్యప్ప భక్తుడు బోడ రామకృష్ణ అయ్యప్ప మాల ధరించి మహా పాదయాత్రగా శభరిమలకు భయలు దేరారు. సోమవారం శ్రీరాంపూర్‌లోని శ్రీ భక్తాంజ నేయ ఆలయం నుంచి ప్రారంభించిన యాత్రను అఖిల భారతీయ అయ్యప్ప ధర్మప్రచార సభ(ఏబీఏపీ) శ్రీరాంపూర్ అధ్యక్షుడు బొడ్డు లక్ష్మణ్, రాష్ట్ర మీడియా ఇంచార్జి బాస్కరి రాజేశం, టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డిలు ప్రారంభించారు. ఆలయంలో వేద పండితులు కొమ్మెర విజయశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహా పాదయాత్ర చేస్తున్న అయ్యప్ప భక్తుడు రామకృష్ణను శ్రీరాంపూర్ కాలనీ అయ్యప్ప సేవా సన్నిదానం గురుస్వాములు శాలువాలతో ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో వనమాల సత్యనారాయణ, దాసరి నవీణ్, జక్కెన రమేష్, బోడ రాజేష్, గంగాధర్, కేతిరెడ్డి భరత్ రెడ్డి, కొండి రజినీకాంత్ పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ పథకం
# నిరుపేదలకు ఒక వరం

**పెంచికల్‌పేట్, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**
పెంచికల్‌పేట్ మండలం మెట్లగూడ గ్రామానికి చెందిన చౌదరి రోజా చికిత్స కోసమై సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.1.40 లక్షల రూపాయల ఎల్ఓసీ లెటర్‌ను ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు సోమవారం వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎంఆర్ఎఫ్ పథకం నిరుపేదలకు ఒక వరం లాంటిది అన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



# పోలీసు అమరులకు నివాళిగా క్యాండిల్ ర్యాలీ



**బెజ్జూర్, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**
బెజ్జూరు మండల కేంద్రంలో సోమవారం ఎస్సై సర్దార్ పాషా ఆధ్వర్యంలో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ప్రధాన వీధుల గుండా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రజల రక్షణలో భాగంగా విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అధికారులకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నివాళులర్పించడం జరిగిందన్నారు. పోలీసులు ప్రజల రక్షణ కోసం పనిచేస్తారని, ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని కోరారు. తెలంగాణ జావిద్, సామల తిరుపతి మాట్లాడుతూ పోలీసులు ప్రజల రక్షణ సంక్షేమం కోసం ప్రతినిత్యం విధులు నిర్వహిస్తారని వారి సూచనలు పాటించి ప్రజలు సహకరించాలని కోరారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, గుడుంబా, గంజాయి లాంటి మత్తు పదార్థాలకు యువత బానిస కావద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, వ్యాపారులు, యువకులు, ప్రజలు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను
# త్వరగా పరిష్కరించాలి



**ఆసిఫాబాద్, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**
ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఆసిఫాబాద్ మండలం రౌటసంకేపల్లి గ్రామానికి చెందిన పోతిని చిన్న వెంకటస్వామి తనకు గల భూమిలో ఆయిల్ ఫామ్ సాగు చేస్తున్నానని, ఉత్పత్తి అయినందున విక్రయించుటకు సరైన రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. పెంచికలపేట మండల కేంద్రానికి చెందిన పాముల నందు తాను గతంలో ఎల్లూర్ గ్రామ శివారులో కొనుగోలు చేసిన భూమికి పట్టా మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. చింతల మానేపల్లి మండలం కేంద్రానికి చెందిన ఇప్ప కోసం తన పేరిట ఉన్న భూమికి పట్టా పాసు పుస్తకం కొరకు దరఖాస్తు చేసుకున్నానని, జారీ చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కాగజ్ నగర్ పట్టణం ద్వారకా నగర్ కాలనీకి చెందిన కత్తెరపాక ప్రమీల తనకు గతంలో ఆసరా పింఛన్ వచ్చేదని, 6 సంవత్సరాలుగా రావడం లేదని, ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. లింగాపూర్ మండల కేంద్రానికి చెందిన బానోత్ అనూష బాయి తనకు వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కౌటాల మండలం ముత్యంపేట గ్రామానికి చెందిన పాలకుర్తి సంతరక్క తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెజ్జూర్ మండలం సోమిని గ్రామానికి చెందిన అల్లూరి లింగయ్య తన భూమి ధరణి పోర్టల్ లో ఇతరుల పేరిట పట్టా అయినందున సవరించి తన పేరిట పట్టా మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కాగజ్‌నగర్ పట్టణంలోని న్యూ కాలనీకి చెందిన కామ్రే మాధవి తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. రెబ్బెన మండలం కొండపల్లి గ్రామంలోని బుద్ధ నగర్ వాసులు తాము 20 కుటుంబాలు నివాసం ఉంటున్నామని, తమకు ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. తిర్యాణి మండలం మాణిక్యపూర్ గ్రామానికి చెందిన టేకం పోసు బాయి తాను 5వ తరగతి వరకు చదివి ఉన్నానని, కిరాణా షాపు ఏర్పాటు కొరకు సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ, గ్రామీణ అభివృద్ధి సంస్థలలో మంజూరు కోసం దరఖాస్తు చేసుకున్నానని, రుణం మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు అర్జీదారులు పాల్గొన్నారు.



## నవజాత శిశు మరణాలను
# తగ్గించేందుకు చర్యలు చేపట్టాలి
### ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో నవజాత శిశువుల సంరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో నిర్వహించిన నూతన శిశు సంరక్షణ శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నవజాత శిశు మరణాల రేటును సింగిల్ డిజిట్ స్థాయికి తగ్గించేందుకు వైద్యులు, నర్సింగ్ సిబ్బంది మరింత అంకితభావంతో, నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. జిల్లాలో గిరిజన ప్రాంతం అధికంగా ఉండటం, పలు భౌగోళిక, సామాజిక సవాళ్లు ఉన్నా వైద్య బృందం అహర్నిశలు కృషి చేస్తోందని తెలిపారు. ఇప్పటికే వైద్య శాఖ చేపడుతున్న చర్యల వలన మాత, శిశు, బాల మరణాలు గణనీయంగా తగ్గాయన్నారు. ప్రతి ప్రసవ కేంద్రంలో, ప్రతి జనన సమయంలో నాణ్యమైన సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని వివరించారు. నవజాత శిశు మరణాలను తగ్గించడమే ప్రధాన లక్ష్యంగా ఐసీఎంఆర్ కార్యక్రమంలో భాగంగా రిమ్స్ ఆదిలాబాద్, నిలోఫర్, ఏఐఐఎంఎస్ ఆసుపత్రులు, హైదరాబాద్ సహకారంతో ఈ శిక్షణ నిర్వహిస్తున్నారని, ఈ శిక్షణ ద్వారా వైద్యులు, నర్సింగ్ సిబ్బంది ప్రతి శిశువుకూ సమయానికి సురక్షిత సేవలు అందించే నైపుణ్యం పెంపొందించుకోవాలని అన్నారు. అనంతరం శిక్షణలో నవజాత శిశు పునరుద్ధరణ, తల్లి పాలు అందించే ఉత్తమ పద్ధతులు, కంగారూ మదర్ కేర్, సంక్రామణ నియంత్రణ విధానాలు వంటి అంశాలపై నిపుణులు ప్రాక్టికల్ సెషన్లు నిర్వహించారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారి నరేందర్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్ డా. జైసింగ్ రాథోడ్, నర్సింగ్ అధికారులు పాల్గొన్నారు.






# తుఫాను వల్ల పంట నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలి

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి - వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు సూచనలు

**ఆసిఫాబాద్, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)** తుఫాను వలన అకాల వర్షాల కారణంగా పంట నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, మార్కెటింగ్, పౌరసరఫరాలు, ఎఫ్ సి ఐ అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా పౌరసరఫరాలు, వ్యవసాయ, మార్కెటింగ్, రవాణా శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రులు మాట్లాడుతూ రాబోయే 2, 3 రోజులలో తుఫాను వల్ల రకాల వర్షాల కారణంగా వరి ధాన్యం, పత్తి, మొక్కజొన్న, సోయా పంట కొనుగోలు ప్రక్రియలు ఎలాంటి ఇబ్బందులు రాకుండా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం మద్దతు ధరతో ఆయా పంట ఉత్పత్తులను కొనుగోలు చేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల, జిల్లా వ్యవసాయ, పౌరసరఫరాలు, మార్కెటింగ్, రవాణా, గ్రామీణ అభివృద్ధి శాఖల అధికారులతో హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు చేయడం కొరకు 40 కేంద్రాలు ప్రారంభించడం జరుగుతుందని, ఇప్పటివరకు 24 వ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి ధాన్యం కొనుగోలు కొరకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. జిల్లాలో పత్తి కొనుగోలుకు సి సి ఐ ఆధ్వర్యంలో 18 జిన్నింగ్ మిల్లులను గుర్తించి నవంబర్ మొదటి వారంలో పత్తి కొనుగోలుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వచ్చే 2, 3 రోజులలో తుఫాను వల్ల పంటలు నష్టపోకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.






## ఉస్మానియా ఆసుపత్రిలో షుగర్ పేషెంట్లకు ప్రత్యేక షూ..!

**ఆదిలాబాద్, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)** డయాబెటిక్ పేషెంట్లు అత్యంత జాగ్రత్తగా ఉండాలని ఉస్మానియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.రాకేశ్ సహాయ తెలిపారు. ఉస్మానియాలో డయాబెటిక్ ఫుట్ క్లినిక్ ద్వారా రోగులకు ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. కాళ్లకు తిమ్మిర్లు, స్పర్శ లేకపోవడం, గాయాలు నయం కాకపోవడం వంటి లక్షణాలు కనిపించే వారు తప్పనిసరిగా ఈ సేవలను ఉపయోగించుకోవాలని సూచించారు.

## భక్తిశ్రద్ధలతో కార్తీక తొలి సోమవారం పూజలు

**ఆదిలాబాద్, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)** శివుడికి అత్యంత ప్రీతికరమైన కార్తీక మా సంలో వచ్చే తొలి సోమవారం పట్టణంలో ని పలు ఆలయాల్లో భక్తులు కార్తీక దీపా లను భక్తిశ్రద్ధలతో వెలిగించారు. ప్రధానంగా శైవ ఆలయాలుగా ఉన్న నందీశ్వర ఆలయం, పాండురంగ శివా లయం, భక్తమార్కండేయ, అన్నపూర్ణ ఆల యం మహిళలు సాయంకాలం వేళ సామూహిక దీపారాధనలు చేశారు.

## కాంగ్రెస్ నేతను పరామర్శించిన మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే

**ఆదిలాబాద్, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)** ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డిని మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు పరామర్శించారు. కంది శ్రీనివాస రెడ్డి బావమరిది గడ్డం అఖిల్ రెడ్డి నిన్న గుండెపోటుతో మృతి చెందడంతో విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సోమవారం బేల మండలం సిర్సన్న గ్రామానికి వెళ్లి అఖిల్ రెడ్డి చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించి, కంది శ్రీనివాస్ రెడ్డితో పాటు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. చిన్నవయసులో గుండెపోటుతో మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. కార్యక్రమంలో జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ రాజేశ్వర్ రెడ్డి, కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, నాయకులు పాకాల రాంచందర్, గిమ్మ సంతోష్ రావు ఉన్నారు.



## శ్రావణి కుటుంబానికి న్యాయం చేయాలి

**ఆసిఫాబాద్, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)** దహెగాం మండలం గెర్రె గ్రామంలో కుల దురహంకార హత్యకు గురైన తలండి శ్రావణి కుటుంబానికి న్యాయం చేయాలని, ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి విచారణ జరిపించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, టీవీజీఎస్ జిల్లా కార్యదర్శి నేర్పల్లి అశోక్ మాట్లాడుతూ శ్రావణి భర్త శేఖర్ కుటుంబ సభ్యులపై రెండు హత్య కేసులు నమోదు చేయాలని, ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి సత్వరం న్యాయవిచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆమె కుటుంబానికి మూడెకరాల భూమి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయాలన్నారు. తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాలశ్రీ, నేర్పల్లి అశోక్, ఉపాధ్యక్షుడు కోట శ్రీనివాస్, సీపీఎం పార్టీ కాగజ్‌నగర్ కన్వీనర్ ముంజం ఆనంద్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గెడం టీకానంద్, గోడిసెల కార్తీక్, ఉపాధ్యక్షులు పురుషోత్తం, నిఖిల్, సహాయ కార్యదర్శి శ్రీకాంత్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వసాకే సాయి, చాపిలే సాయికృష్ణ, ఐద్వా సం ఘం






## రూ.451 కోట్ల నిధులతో బెల్లంపల్లి అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి

### సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

**బెల్లంపల్లి, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)** బెల్లంపల్లి నియోజకవర్గంలో గెలిచిన 22 నెలల్లో అభివృద్ధి కార్యక్రమాల కోసం ఎమ్మెల్యే గడ్డం వినోద్ రూ. 451 కోట్ల నిధులను మంజూరు చేయించారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బత్తుల రవి స్పష్టం చేశారు. సోమవారం బెల్లంపల్లి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడిందని ఆరోపించారు. సోషల్ మీడియాలో ఆ పార్టీ చిన్నచిత కానేతలు తమ హోదాను విస్మరించి ఎమ్మెల్యే వినోద్ పై అసత్య ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే వినోద్ విద్యకు ప్రాధాన్యత ఇస్తూ బెల్లంపల్లికి రూ 350 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ని మంజూరు చేయించారని తెలిపారు. పేద విద్యార్థులకు అనుగుణంగా ఐటీసీని కూడా మంజూరు చేయించారని గుర్తు చేశారు. నిరుద్యోగుల కోసం మెగా జాబ్ మేళా నిర్వహించారని తెలిపారు. జాబ్ మేళాలో 6547 మంది హాజరు కాగా 3339 వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు పొందారని చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధిని గాలికి వదిలేసిన బీ ఆర్ ఎస్ నాయకులు ఎమ్మెల్యే వినోద్ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక సోషల్ మీడియాలో తప్పుడుగా ప్రచారం చేస్తున్నారని అన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా రూ 19.81 కోట్ల నిధులతో రహదారులు, రూ 6.14 కోట్లతో ప్రభుత్వ పాఠశాలల ప్రహరీ గోడలు నిర్మించారన్నారు. రూ 7.03 కోట్లతో అమ్మ ఆదర్శ పాఠశాల నిర్మాణం, రూ 10 కోట్ల స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్స్, రూ 10 కోట్ల డిఎంఎఫ్టి నిధులు, రూ 3.4 కోట్ల సి ఎస్ ఆర్ నిధులు, రూ 17 కోట్ల సి ఆర్ ఆర్ ఎస్ సి సబ్ ప్లాన్ నిధులతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అమృత్ 2.0 పథకం కింద రూ 61.50 కోట్ల నిధులతో బెల్లంపల్లి మున్సిపల్ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించే పనులు చేపడుతున్నట్లు చెప్పారు.

## పారదర్శకంగా మద్యం దుకాణాల లక్కీ డ్రా




**నిర్మల్, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)** జిల్లాలో మద్యం దుకాణాల కేటాయింపుకు సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో లక్కీ డ్రా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొని లక్కీ డ్రా ద్వారా 47 మద్యం షాపులను కేటాయించారు. మొత్తం 991 దరఖాస్తులు అందిన నేపథ్యంలో, ఒక్కో షాపుకు సంబంధించిన దరఖాస్తుల ఆధారంగా టోకెన్ నంబర్లు కేటాయించి, దరఖాస్తుదారుల సమక్షంలో కలెక్టర్ స్వయంగా డ్రా తీశారు. డ్రా ప్రారంభం నుండి ముగింపు వరకు ఫోటో, వీడియో చిత్రీకరణ జరిపి, పూర్తి పారదర్శకతతో ప్రక్రియ పూర్తి చేశారు. ఎలాంటి అవాంతరాలు లేకుండా సాఫీగా డ్రా కొనసాగే గేందుకు అధికారులు పకడ్బందీ ఏర్పా ట్లు చేశారు. కలెక్టరేట్ ప్రాంగణంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో సాగింది. లక్కీ డ్రాలో ఎంపికైన వారికి నిర్ణీత లైసెన్స్ ఫీజు చెల్లించేందుకు అవసరమైన ఏర్పాట్లు వేదికపైనే కల్పించారు. ఈ కార్యక్రమం లో జిల్లా ఎక్సైజ్ అధికారి అబ్దుల్ రజా క్, ఎక్సైజ్ సిబ్బంది, మద్యం దుకాణాల దరఖాస్తుదారులు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





# సైబర్ నేరాలబారిన పడకుండా జాగ్రత్త పడాలి

## రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా





**మంచిర్యాల, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**
ప్రతీ ఒక్కరు సైబర్ నేరాల భారీన పడకుండా జాగ్రత్తగా ఉండాలని, పోలీసుల విధులపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. సోమవారం పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా విద్యార్థుల కోసం రామగుండం పోలీసు కమిషనరేట్‌లో పోలీసు ఓపెన్ హౌజ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో చట్టపర అవగాహన పెంచేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. చట్టాల గురించి, పోలీసు విధులపై, భరోసా సెంటర్ గురించి, కమ్యునికేషన్ సిస్టం గురించి, ఫింగర్ ప్రింట్ డివైజ్‌ల వల్ల కలిగే ఉపయోగాలు, ట్రాఫిక్, తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు. ప్రజల రక్షణ, మహిళ భద్రత, నేరాల నియంత్రణకు పని చేస్తుందని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం వల్ల రోడ్డు ప్రమాదాలు అరికట్టవచ్చునని చెప్పారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. యాప్‌ల ద్వారా రుణాలు తీసు కుంటూ చెల్లించకపోవడం వల్ల ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, యాప్‌లపై అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. మహిళలపై జరుగుతున్న నేరాలను అరిక ట్టడానికి, వారి రక్షణ గురించి షీటీం పనిచేస్తుంద న్నారు. పోలీసులు ఉపయోగిస్తున్న సాంకేతికత గురించి అవగాహన కల్పించారు. పోలీసు వీరుల త్యాగాలు మరువ లేనివన్నారు. భరోసా కేంద్రం గురించి, వాటి పని తీరు, వివిధ యాప్‌ల గురించి అవగాహన కల్పించారు. ఏ సమస్య తలె త్తినా 100కు డయల్ చేస్తే తక్షణమే పోలీసులు స్పందిస్తా రన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ శ్రీనివాస్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, సైబర్ క్రైం ఏసీపీ శ్రీనివాస్ పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకోవాలి

**దహేగాం, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**
దహేగాం మండలం ఇట్యాల గ్రామంలో గిరిజన మహిళ కొత్తపల్లి భారతికి మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఎమ్మెల్యే హరీష్ బాబు సోమవారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వర్షాకాలం ముగిసినందున లబ్దిదారులు వెంటనే పనులు ప్రారంభించాలని, బిల్లుల మంజూరు విషయంలో అనుమానాలు అక్కర్లేదని, అందరికీ సకాలంలో బిల్లులు వచ్చే విధంగా చూస్తామని తెలిపారు.

## విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

**బెల్లంపల్లి, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**
విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని బెల్లంపల్లి వన్ టౌన్ ఎస్‌హెచ్‌ఓ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పోలీసు అమరవీరుల త్యాగాలపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌ఓ శ్రీనివాసరావు విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. యాంటీ డ్రగ్స్ ప్రాముఖ్యతను వివరిస్తూ పోలీసుల పాత్రపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు.

# ధాన్యం కొనుగోలు సమర్ధవంతంగా నిర్వహించాలి

## రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి - వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు సూచనలు





**ఆదిలాబాద్, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**
రాష్ట్రంలో వరి ధాన్యం, పత్తి కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి సూచించారు. సోమవారం హైదరాబాద్ నుండి వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు లతో కలిసి జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పౌరసరఫరాలు, వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి, రవాణా శాఖల అధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ, తుఫాను ప్రభావంతో అకాల వర్షాలు కురిసిన నేపథ్యంలో వరి ధాన్యం, పత్తి కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన టార్పాలిన్ కవర్లు, ప్యాడీ క్లీనర్లు, తేమ యంత్రాలు సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని సూచించారు. వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, తుఫాను తీవ్రత దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తుఫాను తీవ్రత తగ్గేవరకు హార్వెస్టింగ్ నిలిపివేయాలని, కోతపడ్డ ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. రైతులు నష్టపోకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని, కొనుగోలు ప్రక్రియ సాఫీగా సాగేందుకు సంబంధిత శాఖలు సమన్వయం చేసుకోవాలని సూచించారు. పత్తి కొనుగోలు కపాస్ కిసాన్ యాప్ ద్వారా జరుగుతుందని, కౌలు రైతులు కూడా వ్యవసాయ విస్తరణ అధికారుల సహాయంతో తమ వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. వరి ధాన్యం, పత్తి తేమ శాతం నిబంధనలకు అనుగుణంగా ఉండేలా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే సరిహద్దు జిల్లాల్లో అప్రమత్తంగా ఉండి, ఇతర రాష్ట్రాల నుండి వచ్చే వరి ధాన్యం, సోయాబీన్, కందులు, పెసలు వంటి పంటల అక్రమ రవాణా జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, వర్షాల కారణంగా ధాన్యం తడవకుండా రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా కలెక్టర్ రాజార్షి షా మాట్లాడుతూ, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో వరి ధా న్యం, పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వరి ధాన్యం రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కనీస మౌలిక వసతులు కల్పించి, ప్యాడీ క్లీనర్లు, టార్పాలిన్ కవర్లు వంటి సదుపాయాలు అందుబాటులో ఉంచినట్లు వివరించారు. పత్తి రైతుల సమస్యలపై అధికారులు, మి ల్లుల యజమానులు, రైతులు కలిసి చర్చించి పలు ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నారని పేర్కొన్నారు. 12 శాతం తేమ కలిగిన పత్తిని నేరుగా సీసీఐ కొనుగోలు చేస్తుందని, 12 శాతం పైగా తేమ ఉన్న పత్తిని మాత్రం ఈరోజు మాత్రమే ప్రైవేట్ జిన్నింగ్ మిల్లులు క్వింటాల్‌కు రూ.6,950 ధరకు కొనుగోలు చేయాలని నిర్ణయించారని వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామల దేవి, నోడల్ అధికారి కేశవులు, మార్కెటింగ్, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# కుమ్రంభీం జిల్లాలో ముగిసిన మద్యం దుకాణాల ఎంపిక

## లక్కీడ్రా ద్వారా కేటాయింపు - ఏడు దుకాణాల డ్రా వాయిదా

**ఆసిఫాబాద్, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో 2025-27కు సంబంధించి మద్యం దుకాణాలకు జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవనంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన లక్కీ డ్రా ప్రశాంతంగా ముగిసింది. కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, అదనపు కలెక్టర్ డేవిడ్, జిల్లా ఎక్సైజ్ అధికారి జ్యోతి కిరణ్‌లతో కలిసి లక్కీ డ్రా ద్వారా విజేతలను ఎంపిక చేశారు. జిల్లాలోని కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ డివిజన్ పరిధిలో మొత్తం 32 మద్యం దుకాణాలకు గాను 680 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో షాపునంబర్ 9(రెబ్బెన), షాపునంబర్ 10(గోలేటి), షాపునంబర్ 14(కాగజ్‌నగర్‌లోని సర్‌సిల్క్ ఏరియా), షాపునంబర్ 22(రవీంద్రనగర్), షాపునంబర్ 30 (జైనూర్-1), షాపునంబర్ 31(జైనూర్-2) షాపునంబర్ 32(సిర్పూర్ (యూ), దుకాణాలకు దరఖాస్తులు తక్కువ రావడంతో ఉన్నతాదికారుల ఆదేశాల మేరకు ఏడు దుకాణాలకు సంబంధించిన డ్రాను వాయిదా వేశారు. మిగిలిన 25 దుకాణాలకు లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేశారు. ఇందులో మొదటగా ఆసిఫాబాద్ డివిజన్‌లోని మద్యం దుకాణాలకు తర్వాత కాగజ్‌నగర్ డివిజన్‌లోని మద్యం దుకాణాలకు లక్కీ డ్రా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే మాట్లాడుతూ మద్యం దుకాణాల కేటాయింపు ప్రక్రియ లక్కీ డ్రా పద్ధతిన పూర్తి పారదర్శకంగా నిర్వహించామ ని తెలిపారు. అనంతరం జిల్లా ఎక్సైజ్ అధికారి జ్యోతి కిరణ్ మాట్లాడుతూ రెండు సంవత్సరాల ఒప్పందం ద్వారా మద్యం దుకాణాలను కేటాయించడం జరిగింద న్నారు. ప్రభుత్వ విధానాలకనుగుణంగా నియమనిబంధ నలకు లోబడి మద్యం దుకాణాలు నడుపవలసి ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



**లక్కీ విజేతలు వీరే..**
జిల్లాలోని మద్యం దుకాణాలకు లక్కీ డ్రా ద్వారా విజేతలను ఎంపిక చేశారు. ఆసిఫాబాద్ డివిజన్‌లోని ఆసిఫాబాద్ షాప్‌నంబర్- 1 వసంత్‌రావ్, షాప్‌నంబర్- 2 అశోక్, షాప్ నంబర్- 3 వినోద్, షాప్‌నంబర్-4. జగన్, షాప్‌నంబర్- 5. సంతోష్ కుమార్, షాప్‌నంబర్- 6. రజిత, షాప్ నంబర్- 7. సుదర్శనం, షాప్‌నంబర్-8.సంతోష్, షాప్‌నంబర్-11 ప్రహ్లాద్, షాప్‌నంబర్-12 నరేష్, షాప్‌నంబర్-13 రవిందర్ గౌడ్ దుకాణాలను దక్కించుకున్నారు. కాగజ్‌నగర్ డివిజన్‌లోని కాగజ్‌నగర్ షాప్‌నంబర్-15 అశ్విని, షాప్ నంబర్-16 లక్ష్మణ్‌కుమార్, షాప్‌నంబర్-17 శ్రీకాంత్‌రెడ్డి, షాప్‌నంబర్-18 దాసరి వైకుంఠం, షాప్‌నంబర్-19 రాచర్ల వైకుంఠం, షాప్‌నంబర్-20 విఠల్, షాప్‌నంబర్-21 నిఖిత, షాప్‌నంబర్- 23 నగేష్, షాప్‌నంబర్-24 ఉపేంద్ర చారి, షాప్‌నంబర్-25 సంపత్‌కుమార్, షాప్‌నంబర్-26 విష్ణు, షాప్‌నంబర్-27 బావాజీ, షాప్‌నంబర్-28 మల్లికార్జున్‌గౌడ్, షాప్‌నంబర్-29ను మల్లేష్ దక్కించుకున్నారు.

# ఆ పంటల కొనుగోలుకు కేంద్రం వెంటనే అనుమతులు ఇవ్వాలి

**వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**నిర్మల్, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**

రాష్ట్రంలో వరి ధాన్యం, పత్తి కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి సూచించారు. సోమవారం హైదరాబాద్ నుండి వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు లతో కలిసి జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పౌరసరఫరాలు, వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి, రవాణా శాఖల అధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ, తుఫాను ప్రభావంతో అకాల వర్షాలు కురిసిన నేపథ్యంలో వరి ధాన్యం, పత్తి కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన టార్పాలిన్ కవర్లు, ప్యాడీ క్లీనర్లు, తేమ యంత్రాలు సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని సూచించారు. వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, తుఫాను తీవ్రత దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తుఫాను తీవ్రత తగ్గేవరకు హార్వెస్టింగ్ నిలిపివేయాలని, కోత పడ్డ ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. రైతులు నష్టపోకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని, కొనుగోలు ప్రక్రియ సాఫీగా సాగేందుకు సంబంధిత




శాఖలు సమన్వయం చేసుకోవాలని సూచించారు. పత్తి కొనుగోలు కపాస్ కిసాన్ యాప్ ద్వారా జరుగుతుందని, కౌలు రైతులు కూడా వ్యవసాయ విస్తరణ అధికారుల సహాయంతో తమ వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. వరి ధాన్యం, పత్తి తేమ శాతం నిబంధనలకు అనుగుణంగా ఉండేలా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే సరిహద్దు జిల్లాల్లో అప్రమత్తంగా ఉండి, ఇతర రాష్ట్రాల నుండి వచ్చే వరి ధాన్యం, సోయాబీన్, కందులు, పెసలు వంటి పంటల అక్రమ రవాణా జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలన్నారు. వర్షాల కారణంగా ధాన్యం తడవకుండా రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో వరి ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కనీస మౌలిక వసతులు కల్పించి, ప్యాడీ క్లీనర్లు, టార్పాలిన్ కవర్లు వంటి సదుపాయాలు అందుబాటులో ఉంచినట్లు వివరించారు. సి.సి.ఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాలు కూడా సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ మండల తహసీల్దార్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చర్చిస్తూ, తుఫాను ప్రభావం కారణంగా రానున్న మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో రైతులకు నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు తరలించిన ధాన్యం నిల్వలతో పాటు ఆయా ప్రాంతాల్లో ఆరబెట్టిన పంట తడవకుండా టార్పాలిన్‌లు అందుబాటులో ఉంచాలని సూచించారు. తుఫాను ప్రభావం గురించి రైతులకు తెలియజేసి అప్రమత్తం చేయాలని, అవసరమైతే వచ్చే మూడు రోజుల పాటు వరి కోతలు నిలిపివేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల నుండి మిల్లులకు ధాన్యం తరలింపు వెంటనే జరిగేలా పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీవో రత్నకల్యాణి, అధికారులు విజయలక్ష్మి, రాజేందర్, సుధాకర్, నర్సయ్య, తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.



## పాత కక్షలతో వ్యక్తి పై దాడి
# చికిత్స పొందుతూ మృతి

**మంచిర్యాల, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**

గొడవ నేపథ్యంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంచిర్యాల పట్టణం గొల్లవాడకు చెందిన రవి రాజేశ్వర్(40) అనే వ్యక్తి మృతి చెందినట్లు మంచిర్యాల పట్టణ ఎస్సై తిరుపతి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో ఆదివారం మధ్యాహ్నం రవి రాజేశ్వర్ అతని తమ్ముడు సూరజ్ మద్యం సేవించినట్లు తెలిపారు. పాత కక్షను మనసులో పెట్టుకొని రాజేశ్వర్‌ను సూరజ్ కొట్టడంతో తీవ్రంగా గాయపడిన రాజేశ్వర్‌ను కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. ఈ తరుణంలో చికిత్స పొందుతూ మృతి చెందారని తెలిపారు. మృతుని భార్య సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసుదర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# రక్తదానం ప్రాణదానం : ఎస్పీ జానకీ షర్మిల



**నిర్మల్, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**

ఆపదలో ఉన్నవారికి రక్తాన్ని దానం చేయడం ప్రాణదానంతా పుణ్యమని ఎస్పీ జానకీ షర్మిల అన్నారు. సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో పోలీసుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో ఎస్పీ జానకితో పాటు పోలీసులు యువకులు పెద్ద ఎత్తున రక్తదానాన్ని చేశారు. జిల్లాలో పోలీస్ శాఖ శాంతి భద్రతల పర్యవేక్షణతో పాటు సామాజిక సేవా దృక్కోణంలో ముందుకు వెళుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు ఉపేందర్ రెడ్డి, రాజేష్ మీనా అవినాష్‌కుమార్, పోలీసులు పాల్గొన్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో ప్రభుత్వ ఉద్యోగి ఆత్మహత్య

**ఆదిలాబాద్ :** ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం రాత్రి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణంలోని రిక్షా కాలనీకి చెందిన శ్రీరాముల శ్రీకాంత్ (44) పంచాయతీరాజ్ శాఖలో సీనియర్ అసిస్టెంట్గా పనిచేస్తున్నాడు. ఈయనకు భార్య వాణిశ్రీ, కూతురు శ్లోక ఉన్నారు. గతకొంత కాలంగా భార్య అనారోగ్యం బారిన పడింది. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. మనస్తాపానికి గురైన శ్రీకాంత్ పురుగుల మందు తాగడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆ తర్వాత కోరుట్లలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు.

# సీటీవో పోస్టుల భర్తీ

## ఉమ్మడి జిల్లాకు గ్రూప్ -1 అధికారుల నియామకం

**ఆదిలాబాద్, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**

కొంత కాలంగా ఇంచార్జీ అధికారులతో సతమతమవుతున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాణిజ్య పన్నుల శాఖకు ఎట్టకేలకు రెగ్యులర్ అధికారులు రానున్నారు. ప్రస్తుతం నాలుగు జిల్లాల్లోనూ ఇంచార్జీలే బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇటీవల ప్రకటించిన గ్రూప్-1 ఫలితాల్లో కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్ (సీటీవో)లుగా ఎంపికైన నలుగురిని ఉమ్మడి జిల్లాకు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో ఆదిలాబాద్ జిల్లాకు మట్టేగాం పద్మప్రియ, మంచిర్యాలకు నసీంభాను, నిర్మలకు తోగట మోహన్ కుమార్ ప్రణతి, ఆసిఫాబాద్ జిల్లాకు మందరి నాగార్జునరెడ్డి నియామకమయ్యారు. వీరంతా ప్రస్తుతం హైదరాబాద్ బేగంపేటలోని వాణిజ్యపన్నులశాఖ జాయింట్ కమిషనర్ కార్యాలయంలో శిక్షణ పొందుతున్నారు. ఆరునెలల వృత్తిపరమైన శిక్షణ పూర్తయిన తర్వాత ఆయా జిల్లా అధికారులుగా బాధ్యతలు స్వీకరించనున్నట్లు ఆ శాఖ వర్గాలు తెలిపాయి.

# సోయా కొనుగోళ్లపై సోయి లేని ప్రభుత్వాలు

**బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యే ఇద్దరూ.. దద్దమ్మలే - మాజీ మంత్రి జోగు రామన్న ధ్వజం**

**రైతులకు అండగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన - జాతీయ రహదారి దిగ్బంధం... రోడ్లపై వంటావార్పు**

**ఆదిలాబాద్, అక్టోబర్ 27 (ప్రభాత సమాచారం)**

రైతులు పండించిన సోయాబీన్ పంటను అమ్మకానికి మార్కెట్ యార్డ్ లకు తీసుకువచ్చిన ఇంకా కొనుగోలు ప్రారంభించకపోవడంతో జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ నేతలు ఆందోళనలకు దిగారు. బేల మండల కేంద్రంలో సోయాబీన్ రైతులు ఎదుర్కొంటు న్న సమస్యలపై మాజీ మంత్రి జోగు రామన్న బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి సోమవారం నిరసన చేపట్టారు. రైతులతో కలిసి బేల జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో పట్టడంతో రహదారికి ఇరువైపులా కిలోమీటర్ల మేర భారీగా వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు ఇబ్బంది ఏర్పడింది. మార్కెట్ కు తీసుకొచ్చిన సోయా పంటను చూయిస్తూ నిరసన నినాదాలతో హోరెత్తించారు. దీంతో మార్కెట్ అధికారులు, పోలీసులు వచ్చి ఆం దోళనకారులను సముదాయించిన ఫలితం లేకపోవడంతో చాలాసేపు నిరసన కొనసాగింది. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ... సోయా కొనుగోళ్ల పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సోయి లేదని మండిపడ్డారు. మార్కెట్ అధికారులు సోమవారం సొయా కొనుగోలు ప్రారంభిస్తామని చెప్పి మాట తప్పడంతో రైతులు ఇబ్బందులకు గురిఅవుతున్నారన్నారు. తక్షణం కొనుగోలు ప్రారంభించకుంటే తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తామన్నారు. బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యే ఇద్దరు దద్దమ్మలే అని ఆరోపించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను



పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు. ప్రకృతి విపత్తులతో అధిక వర్షాభావ పరిస్థితుల్లో రైతులు పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, ఇలాంటి తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం రైతులకు ధైర్యాన్ని ఇవ్వకపోవడం దురదృష్టకరమన్నారు. తేమ శాతం లేకుండా సోయా, పత్తి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే జిల్లా రైతాంగా సమస్యల కంటే జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారం ముఖ్యమైందా అని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రౌతు మనోహర్, ప్రమోద్ రెడ్డి, సతీష్ పవార్, గంభీర్ ఠాక్రే, విపిన్, కుమ్రా రాజు, రాజన్న, సతీష్, తదితరులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

**సోనాలలో రోడ్డుపై వంటావార్పు...**

రైతులు పండించిన సోయాబీన్ పంట కొనుగోలు చేయాలంటూ సోనాల మండల కేంద్రంలో సైతం బీఆర్ఎస్ శ్రేణులు రైతులకు అండగా ఆందోళనకు దిగారు. బోథ్ మండల మాజీ అధ్యక్షులు తుల శ్రీనివాస్ నేతృత్వంలో సోమవారం రైతులతో కలిసి రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. అనంతరం రోడ్డుపైనే వంటావార్పు చేపట్టి తమ నిరసన వ్యక్తం చేశారు. దీంతో కాసేపు ట్రాఫిక్కు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఈ సందర్భంగా తుల శ్రీనివాస్ మాట్లాడుతూ సొనాల మండల కేంద్రంలో సోయాబీన్ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి, వెంటనే కొనుగోలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఖరీఫ్ సీజన్ పూర్తయి నెలరోజులు గడుస్తున్నా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యనికి నిదర్శనం అని మండిపడ్డారు. ఈ నిరసన కార్యక్రమంలో పలువురు రైతులు, బీఆర్ఎస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.



## కొత్తిమీరతో లాభాలెన్నో

కొత్తిమీరను కేవలం రుచి, సువాసనల కోసం మాత్రమే అనుకుంటే పొరపాటే. కొత్తిమీరతో ఉన్న ఆరోగ్య ప్రయోజనాలెన్నో. కొత్తిమీరతో సమకూరే లాభాల్లో ఇవి కొన్ని..

కొత్తిమీరలో విటమిన్-ఏ పుష్కలంగా ఉండటం వల్ల అది కంటి చూపును మెరుగుపరుస్తుంది. ఇందులో విటమిన్-బి కాంప్లెక్స్‌కు చెందిన బి1, బి2, బి3, బి5, బి6 వంటి అనేక విటమిన్లు కూడా ఎక్కువే. ఇవన్నీ మనకు వ్యాధినిరోధక శక్తిని ఇస్తాయి. విటమిన్-సి కూడా కొత్తిమీరలో ఉండటం వల్ల అది శక్తిమంతమైన యాంటీఆక్సిడెంట్‌గా పనిచేసి ఎన్నో రకాల క్యాన్సర్‌లను నివారిస్తుంది.



కొత్తిమీరలో విటమిన్-ఇ కూడా ఉంటుంది. శరీరానికి మంచి నిగారింపును ఇవ్వడానికి, చర్మంపై ముడతలను తొలగించడానికి బాగా తోడ్పడుతుంది.

కొత్తిమీరలో ఐరన్ ఎక్కువగా ఉంటుంది. అనీమియాతో బాధపడేవారు.. తినే అన్ని పదార్థాలను కొత్తిమీరతో గార్నిష్ చేసుకుని తింటే ఆ సమస్యను తగ్గించుకోవచ్చు.

ఇందులోని పొటాషియమ్ రక్తపోటును నివారిస్తుంది. తద్వారా గుండెజబ్బులను అరికడుతుంది.

కొత్తిమీర కిడ్నీ సమస్యలను సమర్థంగా నివారిస్తుంది. మెగ్నీషియమ్, జింక్ వంటి ఖనిజాలు కొత్తిమీరలో బాగా ఎక్కువే. అందుకే జుట్టు మంచి మెరుపుతో నిగనిగలాడేందుకు కొత్తిమీర బాగా ఉపయోగపడుతుంది. కొత్తిమీరలో కాల్షియమ్ కూడా ఎక్కువే. అందుకే అది ఎముకలను పటిష్టంగా మార్చి, వాటి ఆరోగ్యాన్ని పెంచుతుంది.



# మొక్కల్ని పెంచండిలా..






**ఇంట్లో పచ్చదనం** ఉంటే మనసుకి హాయిగా ఉండటంతో పాటు ఆరోగ్యం కూడా బాగుంటుంది. ఇళ్లలో అందం కోసం, అలంకరణ కోసం తీగలు, పూల మొక్కలు, ముళ్ల చెట్లు మాత్రమే కాదు, ఆహారం కోసం, ఆరోగ్యం కోసం ఆకు కూరలు, కూరగాయల మొక్కలు, ఔషధ మొక్కలు.. వంటివి పెంచుకోవడానికి కొంచెం స్థలం చాలు. అయితే ఏ మొక్కల్ని ఎక్కడ పెంచాలి.. ఎలా పెంచాలి అనే అవగాహన ఉంటే ఇంటిని పచ్చదనంతో అందంగా తీర్చిదిద్దుకోవచ్చు.

### వంటగది

ఆడవాళ్లు ఎక్కువ సమయం ఉండేది కిచెన్‌లోనే. కాబట్టి వంటగదిని ఆనుకుని బాల్కనీ ఉంటే మెంతికూర, కొత్తిమీర పుదీనా వంటి ఆకుకూరలను పెంచండి. తగినంత వెలుతురు అందినప్పుడు ఈ మొక్కలు బాగా పెరుగుతాయి. అంతేకాకుండా అవసరానికి కూడా ఉపయోగపడతాయి. చిన్న చిన్న కుండీలు, పనికిరాని డబ్బాలు, ట్రేలలో కూడా పెంచుకోవచ్చు.

### లివింగ్ రూమ్

ఇంట్లోకి వచ్చిన వారిని ఆకట్టుకోవాలంటే లివింగ్ రూమ్‌లో ఒకటి రెండు మొక్కలు ఉండి తీరాల్సిందే. వెలుతురు లేకపోయినా.. చక్కగా పెరిగే మొక్కలను ఎంచుకోవచ్చు. అలాంటి మొక్కల్లో అరికా పామ్ , పీస్‌లిల్లీ, ఫిలడెండ్రాన్ వంటివి చూడ్డానికి బాగుంటాయి. ఈ మొక్కలపై నాసా నిర్వహించిన 'క్లీన్ ఎయిర్' అధ్యయనంలో గాలిని శుద్ధిచేసే గుణాలున్నట్టు గుర్తించారు. హాల్లో సక్యులెంట్లతో రూపొందించిన చిన్న టెర్రారియంలనూ ఉంచుకోవచ్చు. బొన్సాయ్‌లూ ప్రయత్నించొచ్చు.

### బెడ్‌రూమ్

బెడ్‌రూమ్‌లో పెంచుకునేందుకు సువాసనతో పాటు ఆహ్లాదాన్ని కలిగించే మల్లె, గార్డేనియా వంటి మొక్కల ఎంచుకోవచ్చు. ఇప్పుడంతా పడకగదికి వెలుతురు సరిగా అందాలని కోరుకుంటున్నారు. దానికి తగ్గట్లే ఇంటి నిర్మాణాలు ఉంటున్నాయి. కాబట్టి వెలుతురు కోసం పెద్దగా ఇబ్బందిపడాల్సిన అవసరం లేదు. బెడ్‌రూం కిటికీ దగ్గర వెలుతురు పడేలా వీటిని పెట్టుకోవచ్చు లేదంటే బెడ్‌రూమ్‌ను ఆనుకుని బాల్కనీ ఉంటే అక్కడ పెంచుకోవచ్చు. అలంకరణ కోసం లక్కీబాంబు, మనీప్లాంట్ వంటి మొక్కలను కూడా పెట్టుకోవచ్చు.



ఇష్టంగా మొక్కలు తెచ్చి పెంచుకోవాలనుకుంటాం. కానీ మనం చేసే కొన్ని పొరపాట్లతోనే అవి అనుకున్నట్టుగా పెరగవు. అలా కాకుండా ఒక అవగాహనతో మొక్కలు పెంచాలి.

- చాలామందికి మొక్కలకు ఎంత వెలుతురు ఉండాలనేది తెలియదు. కొంతమంది విపరీతమైన వెలుతురులో పెట్టేస్తే.. మరికొందరు చీకట్లో ఉంచుతారు. దానివల్ల మొక్కలు సరిగ్గా పెరగవు. మొక్కను బట్టి దానికి ఎంత వెలుతురు అవసరమనేది ఆధారపడి ఉంటుంది. పూలు పూ సేవన్నింటికి వీలైనంతవరకూ ఎండ అవసరముంటుంది. నర్సరీలో కొనేటప్పుడు ఆ మొక్కల్ని ఎక్కడ పెట్టారో చూస్తే.. ఎంత వెలుతురు అవసరం అనేది తెలుస్తుంది.
- ఒక్కోసారి మొక్కకు అవసరాని కంటే ఎక్కువ నీళ్లు పోస్తాం. కానీ అది పొరపాటు. భూమిలో పాతే మొక్కలకు మట్టి తడిసేలా నీళ్లు పోయాలి. అదే కుండీల్లో అయితే నీళ్లు పోస్తున్నప్పుడు అవి కుండీల నుంచి ఇవతలకు వస్తే చాలు. ప్రతి కుండీకి అడుగున రంధ్రం ఉంటుంది. దాన్ని గమనించుకుంటూ నీళ్లు పోస్తే ఇబ్బంది ఉండదు.
- మొక్కలకు నీళ్లు మాత్రమే పోస్తే చాలదు. మట్టికి కొన్నిరకాల పోషకాలు కూడా అవసరమవుతాయి. అయితే అవి మొక్కను బట్టి మారుతాయి. కాబట్టి.. నిపుణుల సలహాతో సరైన ఎరువులు ఎంచుకుని మొక్కలకు వేయాలి. అలాగే తెగుళ్లు, కీటకాలకు కూడా క్రిమిసంహారక మందులు వాడాలి.
- కొంతమందికి మొక్కను బట్టి కుండీని ఎంచుకోవాలనే అవగాహన ఉండదు. చిన్న కుండీలో పెద్ద మొక్కను పెంచేస్తుంటారు. దీనికి పరిష్కారం నెలకోసారి కుండీని గమనించుకోవాలి. ఆ మొక్క వేర్లు పైవరకూ లేదా కుండీ అడుగున రంధ్రం దాటి బయటకు వచ్చాయా.. లేదా అనేది తెలుస్తుంది. దాన్ని బట్టి కుండీని మార్చుకోవాలి.
- వాతావరణంతో, కాలంతో సంబంధం లేకుండా మొక్కల్ని పెంచడం సరికాదు. అవి కేవలం పెరగడం తప్ప పూలు రాకపోవచ్చు. అందుకే పెంచుకునే ముందే అవి ఆ కాలానికి అనువైనవో.. కావో తెలుసుకోవడం మంచిది.



## రైతులకు ఇబ్బంది కలగకుండా కొనుగోళ్లు

**కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్యే పాయల్ శంకర్**



జిల్లాలో వాతావరణంలో ఏర్పడిన మార్పుల వల్లే పత్తిలో తేమ శాతం పెరిగిందని, రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు జరిగేలా చూస్తామని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ములిగే నక్క మీద తాటికాయ పడ్డట్టు అసలే ఇబ్బందుల్లో ఉన్న రైతులకు అధిక వర్షాల వల్ల తేమశాతం పెరుగుతోందని, తేమ శాతం విషయంలో సీసీఐ సిఎండి, చీఫ్ సెక్రటరీ, అధికారులతో మాట్లాడటం జరిగిందన్నారు. రైతులు ఆందోళన చెందవద్దని అన్నారు.



# తొలిరోజే తేమ పేచీ

# ప్రతిష్టంభన

## తేలని తేమ కిరికిరి.. దక్కని మద్దతు ధర.. రోడ్డెక్కిన పత్తి రైతులు



ఆదిలాబాద్ జిల్లాలో పత్తి కొనుగోళ్లలో ప్రతిష్టంభన నెలకొంది. మార్కెట్‌లో కనీసం ప్రభుత్వ మద్దతు ధర దక్కకపోవడంతో అన్నదాతల ఆశలు ఆవిరయ్యాయి. వ్యాపారులు, అధికారుల తీరుతో ఆక్రోశం వ్యక్తం చేస్తూ ఆందోళన చేపట్టారు. పత్తిలో తేమ అధికంగా ఉందని కొనుగోళ్లకు సీసీఐ నిరాకరించడం, వ్యాపారులు ప్రభుత్వ మద్దతు ధర కంటే తక్కువగా నిర్ణయించడంతో.. పత్తితో మార్కెట్‌కు వచ్చిన అన్నదాతలు అగచాట్లు పడాల్సిన పరిస్థితి తలెత్తింది. కొనుగోళ్లు ప్రారంభించిన తొలిరోజే పత్తి విక్రయాలకు అంతరాయం ఏర్పడింది. జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆధ్వర్యంలో సోమవారం సీసీఐ అధికారులు, వ్యాపారులు, రైతుల సమక్షంలో పత్తి కొనుగోళ్లు ప్రారంభించారు. యార్డులో కొనుగోళ్లు ప్రారంభం కాగానే ఒకటి రెండు వాహనాలు మినహా.. మిగతా వాటికి తేమ శాతం అధికంగా చూపించడంతో సీసీఐ అధికారులు కొనుగోళ్లు నిలిపివేశారు. దీంతో రైతుల్లో ఒక్కసారిగా ఆగ్రహం వ్యక్తమైంది. తూకం వేసే కాంటాల వద్దనే ఆందోళన చేపట్టారు. తొలి పత్తి కావడంతో కొంత తేమ చూపిస్తుందని సీసీఐ కొనుగోలు చేయాలని పట్టుబట్టారు. కానీ ఆ సంస్థ అధికారులు ఇందుకు నిరాకరించడంతో రైతులు ఆందోళనకు దిగారు. మరో పక్క సీసీఐ ధర క్వింటాల్ కు రూ. 8110 ఉండగా.. ప్రైవేట్ వ్యాపారులు క్వింటా రూ.6950 ధర నిర్ణయించారు.

- తేమ ఎక్కువగా ఉంది.. పత్తి కొనం
- తొలిరోజే కొనుగోళ్లను నిలిపి వేసిన సీసీఐ
- 12 శాతానికి మించి తేమ ఉందంటూ సాకు
- మార్కెట్‌లో కాంట వద్ద రైతుల ఆందోళన
- వ్యాపారులతో కలెక్టర్, ఎమ్మెల్యే చర్చలు
- గూడుగోన పద్ధతిలో క్వింటాల్‌కు రూ.6,950 చొప్పున కొనేందుకు వ్యాపారుల అంగీకారం
- ఆ తర్వాత ప్రారంభమైన పత్తి కొనుగోళ్లు..

■ సీసీఐ పత్తి మద్దతు ధర క్వింటాలుకు : రూ.8,110 ■ మొదటి రోజు ప్రైవేట్ వ్యాపారుల ధర : రూ.8,950
■ మార్కెట్‌కు వచ్చిన పత్తి బండ్లు : 600 ■ తేమతో సంబంధం లేకుండా ఒక్క రోజు రూ.6,950 ఖరారు

(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)

రాష్ట్రంలో పత్తి కొనుగోళ్లు ప్రారంభమైన తొలిరోజే ప్రతిష్టంభన నెలకొంది. ఆదిలాబాద్‌లో మార్కెట్ యార్డుకు రైతులు తెచ్చిన పత్తిలో తేమ శాతం ఎక్కువగా ఉందంటూ సీసీఐ అధికారులు కొనుగోళ్లు నిలిపివేశారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన రైతులు ఆందోళనకు దిగారు. అక్కడకు చేరుకున్న కలెక్టర్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ వ్యాపారులతో మాట్లాడి.. గుడుగోనా పద్ధతిలో క్వింటాలుకు రూ.6,950 చొప్పున కొనాలని చెప్పడంతో అంగీకరించారు. రైతులు కూడా అంగీక రించడంతో తిరిగి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో సోమవారం ఉదయం సీసీఐ ధర క్వింటాల్‌కు రూ. 8,110 మద్దతు ధరతో పత్తి కొనుగోళ్లు ప్రారంభించారు. ప్రభుత్వం ఈ ఏడాది తొలిసారి కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుకింగ్ ప్రక్రియలో కొనుగోలు చేపడుతుండగా.. తొలిరోజున 500 వరకు పత్తి బండ్లు మార్కెట్‌కు వచ్చాయి. ఒకటి, రెండు వాహనాలు మినహా.. మిగితా వాటికి తేమ శాతం అధికంగా చూపించడంతో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) అధికారులు కొను గోళ్లు నిలిపివేశారు. దీంతో రైతుల్లో ఒక్కసారిగా ఆగ్రహం వ్యక్తమైంది. తూకం వేసే కాంటాల వద్దనే ఆందోళన చేపట్టారు. తొలి పత్తి కావడంతో సహజంగానే కొంత మేర తేమ చూపిస్తుందని, ఇటీవల కురుస్తున్న వర్షాలతో సైతం పత్తిలో తేమ ఉంటుందని





రైతులు చెప్పారు. సీసీఐ కొనుగోలు చేయాలని పట్టుబట్టారు. కానీ అధికారులు ఇందుకు నిరాకరించడంతో రైతులు ఆందోళనకు దిగారు. కొనుగోళ్లు నిలిచిపోవడంతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్ మార్కెట్‌కు వచ్చి రైతులతో మాట్లాడారు. వారి సమస్యను తెలుసుకొని మార్కెట్ అధికారులతోనూ చర్చించారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే, వ్యాపారులు, సీసీఐ, మార్కెటింగ్ అధికారులు, రైతు సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సుదీర్ఘంగా సాగిన ఈ సమావేశంలో ఓ నిర్ణయం తీసు కున్నారు. తేమ శాతం 12 వరకు వస్తే సీసీఐ కొనుగోలు చేయడం, అంతకుమించి తేమ శాతం ఉంటే ప్రైవేట్ వ్యాపారులకు రూ.6,950గా విక్రయించాల్సి ఉంటుందని నిర్ణయించారు. గూడ గోన పద్ధతి (తేమతో సంబంధం లేకుండా ప్రస్తుతం వ్యాపారులు నిర్ణయించిన పూర్తి ధర) ప్రకారమే రైతులకు చెల్లించాల్సి ఉంటుంది. దీంతో ఈ ప్రతిపాదనకు రైతులు సైతం అంగీకరించారు. దీంతో మధ్యాహ్నం 3 గంటల తర్వాత పత్తి కొనుగోళ్లు తిరిగి ప్రారంభమయ్యాయి. జిల్లాలో వాతా వరణంలో ఏర్పడిన మార్పువల్లే పత్తిలో తేమ శాతం పెరిగిందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు జరిగేలా చూస్తా మని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఇప్పటికే సీసీఐ సీఎండీ, చీఫ్ సెక్రటరీ, అధికారులతో మాట్లాడినట్టు తెలిపారు. తేమ శాతం సమస్యకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు.

**రైతులకు ఇబ్బంది కలగకుండా కొనుగోళ్లు**

**ఎమ్మెల్యే పాయల్ శంకర్**

జిల్లాలో వాతావరణంలో ఏర్పడిన మార్పుల వల్లే పత్తిలో తేమ శాతం పెరిగిందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు జరిగేలా చూస్తామని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో సోమవారం సీసీఐ పత్తి కొనుగోలు ప్రారంభమైన నేపథ్యంలో, కొద్దిసేపటికే తేమ శాతం కారణంగా కొనుగోలు నిలిచిపోయాయి. మార్కెట్ యార్డును ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక అధికారులు, రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 8 నుంచి 12 శాతం తేమ ఉంటే సీసీఐ పత్తి కొనుగోలు చేపట్టడం జరుగు తుందని తెలిపారు. ములిగే నక్క మీద తాటికాయ పడ్డట్టు అసలే ఇబ్బందుల్లో ఉన్న రైతులకు అధిక వర్షాల వల్ల తేమ శాతం పెరుగుతోందన్నారు. తేమ శాతం విషయంలో ఇప్ప టికే సీసీఐ సిఎండి, చీఫ్ సెక్రటరీ, సంబంధిత అధికారులతో మాట్లాడటం జరిగిందన్నారు. ఏరకంగానైనా తేమ శాతం సమస్యకు పరిష్కారం చూపుతామని, రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దన్నారు.



